## ధనుష్ డీ56లో ప్రీతి ముకుందన్




ప్రజా గళమే

# స్పంద

SPANDHA NEWS

జాతీయ తెలుగు దినపత్రిక

Praja Galame Spanda సత్యానికి స్వరం APMUL/26/A3106








ఆదివారం || 27-9-2026 || సంపుటి: 1 || సంచిక: 55 || పేజీలు: 8 || వెల : రూ.5/- Circulated From : Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal


# మత్స్యకారులకు 50 కేజీల ఉచిత బియ్యం

## వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు ఆసరా



## కృష్ణా నదిపై మరో 2 కొత్త బ్యారేజీల నిర్మాణం

- కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశం
- జలాశయాల్లో 21 టీఎంసీల మేర పెరిగిన నీటిమట్టం
- భారీ వర్షాలు, వరదలపై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, వరదలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించారు. గత ఐదు రోజులుగా సముద్రంలోకి వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం ఉచితంగా అందించాలని ఆదేశించారు. కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఒక కొత్త బ్యారేజీ, దిగువన మరో బ్యారేజీ నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలతో 29 రిజర్వాయర్లలో దాదాపు 21 టీఎంసీల మేర నీటిమట్టాలు పెరిగాయని అధికారులు వివరించగా, ఈ నీటిని సద్వినియోగం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

**అమరావతి, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో నదులు, రిజర్వాయర్లలో పెరిగిన ప్రవాహాలు, ముంపు పరిస్థితులపై శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల్లో నివాస ప్రాంతాలు జలమయం కావడం, పంటలు ముంపునకు గురైన పరిస్థితి, తీసుకుంటున్న సహాయక చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత 5 రోజులుగా సముద్రంలోకి వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు ఉచితంగా 50 కేజీల బియ్యం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు సహాయం అందించేందుకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని సూచించారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఎగువ రాష్ట్రాల నుంచి పెద్దగా ప్రవాహాలు లేవని,

మిగతా 2 లో

## విజయవాడలో మిషన్ కర్మయోగి

2



## ఏపీ ఇక ఏవియేషన్ హబ్!

**కర్నూలులో తొలి పైలట్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి**

- రూ. 100 కోట్లతో ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ
- భోగాపురంలో ప్రపంచ స్థాయి ఏవియేషన్ యూనివర్సిటీ

2

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే తిరుగులేని ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. కర్నూలు జిల్లాను ఏవియేషన్, డ్రోన్, పారిశ్రామిక రంగాలకు కీలక కేంద్రంగా మారుస్తున్నామని పేర్కొన్నారు.

## రద్దు చేయడమే విధానమా?



- అన్నమయ్య పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టు రద్దుపై వైఎస్సార్‌సీపీ ఫైర్
- సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే విరమించుకున్నారా అని నిలదీత
- నందలూరు మండలంలో భారీ ప్రాజెక్టును కోల్పోయిన స్థానికులు
- కరుణాకర్ రెడ్డి



## ఏపీ ఐ అండ్ పీఆర్ శాఖకు అరుదైన గుర్తింపు

**జాతీయ స్థాయిలో స్కోచ్ సిల్వర్ పురస్కారం సొంతం**

3



**ఓటర్లకు ఇబ్బంది లేకుండా**

## ఎస్ఐఆర్ ప్రక్రియ

- ఇంటి వద్దకే బీఎల్ఓలు, డాక్యుమెంట్ల ఆన్‌లైన్ అప్‌లోడ్!
- సమగ్ర సవరణలో కీలక నిర్ణయాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

4

## సీఈసీపై పోరుకు 'ఇండియా' సమాయత్తం

**సెప్టెంబర్ 30న ఢిల్లీలో కూటమి అగ్రనేతల కీలక సమావేశం**

- జ్ఞానేశ్‌కుమార్ తొలగింపు డిమాండ్‌పై ఉమ్మడి వ్యూహానికి కసరత్తు
- దేశవ్యాప్త ఆందోళనలు.. తదుపరి కార్యాచరణపై చర్చించే అవకాశం

4

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్‌పై ఉమ్మడి కార్యాచరణ రూపొందించేందుకు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సమాయత్తమవుతోంది.





## తిరుమలలో పౌర్ణమి గరుడసేవ!

2



## ప్రతి రైతు నష్టాన్నీ నమోదు చేయాలి!

**పిఠాపురం వరద ముంపు ప్రాంతాలపై డిప్యూటీ సీఎం పవన్ ఆరా**

2

## టూరిజంలో కొత్త శకం

- సాంకేతికత ఆధారితంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తాం
- పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక డాక్యుమెంటరీలు
- ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

2



ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
ఆదివారం, 27 సెప్టెంబర్ 2026

# ఏపీ ఇక ఏవియేషన్ హబ్!

**కర్నూలులో పైలట్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి**

**రూ. 100 కోట్లతో ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ**

**డ్రోన్ సిటీగా కర్నూలు.. 30 వేల మంది పైలట్ల అవసరం**

**భోగాపురంలో ప్రపంచ స్థాయి ఏవియేషన్ యూనివర్సిటీ**



**కర్నూలు, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే తిరుగులేని ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. కర్నూలు జిల్లాను ఏవియేషన్, డ్రోన్, పారిశ్రామిక రంగాలకు కీలక కేంద్రంగా మారుస్తున్నామని పేర్కొన్నారు. కర్నూలు విమానాశ్రయంలో సుమారు రూ. 100 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన రాష్ట్ర మొట్టమొదటి ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ'ని రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలి పైలట్ శిక్షణ కేంద్రాన్ని కర్నూలులో ప్రారంభించడం ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. విమానాశ్రయాల నిర్మాణానికే పరిమితం కాకుండా శిక్షణ, నిర్వహణ, గ్రౌండ్ ఆపరేషన్స్ సహా సమగ్ర ఏవియేషన్ ఎకోసిస్టమ్‌ను ఏపీలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కర్నూలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సమీపంలో ఉండటం, ఏడాది పొడవునా వాతావరణం అనుకూలించడం ఇక్కడి ప్రత్యేకత అని వివరించారు. ప్రస్తుతం ఈ అకాడమీలో 3 శిక్షణ విమానాలు ఉండగా, త్వరలో వీటిని 10 కి పెంచుతామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా విమానాల ఆర్డర్లు 1,600 దాటాయని, రాబోయే 10ఉ15 ఏళ్లలో 30 వేల మంది పైలట్ల అవసరం ఉంటుందని మంత్రి తెలిపారు.

**డ్రోన్ సిటీకి అనుగుణంగా డీజీసీఏ విభాగం..**

కర్నూలులో ఏర్పాటు కానున్న డ్రోన్ సిటీకి అనుగుణంగా డ్రోన్ల నాణ్యతా పరీక్షలు, ధృవీకరణ కోసం డీజీసీఏ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కర్నూలు ఎయిర్‌పోర్టులో నైట్ ల్యాండింగ్ సదుపాయం, అదనపు విమాన సర్వీసుల కల్పనకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. భోగాపురంలో 139 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు కానుందని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు నూతన విమానాశ్రయాలు రూపుదిద్దుకోనున్నాయని స్పష్టం చేశారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు విజన్‌తో 2017 లో శంకుస్థాపన చేసుకున్న కర్నూలు ఎయిర్‌పోర్టు నేడు శిక్షణా కేంద్రంగా ఎదగడం గర్వకారణమన్నారు. ఓర్వకల్లులో తొలి దశలో 180 ఎకరాలు, 2 వ దశలో 400 ఎకరాల్లో 'డ్రోన్ సిటీ' అభివృద్ధి కానుందని, స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. కర్నూలుఉ విజయవాడ మధ్య ఉదయం, సాయంత్రం రోజువారీ విమాన సర్వీసులు నడపాలని, కర్నూలులో విమానాల మరమ్మతు కేంద్రం, రన్‌వే విస్తరణ, డీజీసీఏ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ ఎ. సిరి, ఎమ్మెల్యేలు గౌరు చరిత, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, కేంద్ర విమానయాన శాఖ జాయింట్ సెక్రటరీ మధుసూదన శర్మ, ఓరియంట్ ఏవియేషన్ చైర్మన్ డాక్టర్ ఆనంద్ జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో పౌర్ణమి గరుడసేవ!

**వైభవంగా జరిగిన శ్రీ మలయప్ప స్వామివారి వాహనసేవ**

**గరుడునిపై ఆలయ మాడవీధుల్లో విహరించిన మలయప్పస్వామి**

**భక్తులను కటాక్షించిన సర్వాలంకార భూషితుడైన శ్రీవారు**

**పాల్గొన్న తిరుమల పెద్ద జీయర్, చిన్న జీయర్ స్వాములు**

**హాజరైన టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అధికారులు**



**తిరుమల, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** తిరుమలలో శనివారం రాత్రి పౌర్ణమి గరుడసేవ అత్యంత వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞాన వైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞాన వైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు. ఈ వాహనసేవలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు 50 కేజీల ఉచిత బియ్యం!

(మొదటి పేజీ తరువాయి..)

స్థానికంగా వస్తున్న వరద నీటి కారణంగానే ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు వివరించారు. ఈ స్థానిక వరద నీటిని పూర్తి స్థాయిలో నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్యన ఒక కొత్త బ్యారేజీ నిర్మాణం అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రకాశం బ్యారేజీ దిగువన కూడా ఇంకో బ్యారేజీ నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఈ 2 బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. హిరమండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించే ప్రక్రియను వేగవంతం చేసి, వంశధార నీటిని హిరమండలం రిజర్వాయర్‌లోకి తరలించేలా ఇరిగేషన్, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**21 టీఎంసీలు పెరిగిన నీటిమట్టం..**

భారీ వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 29 రిజర్వాయర్లలో దాదాపు 21 టీఎంసీల మేర నీటి మట్టాలు పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పెరిగిన ఈ నీటి మట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. తాజా వర్షాలతో రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందన్నారు. కోస్తాంధ్రలో ప్రస్తుతం 19.80 శాతం, రాయలసీమలో 42 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాయని, అయితే ఉత్తరాంధ్రలో ఎగువ ప్రాంతాల నుంచి నదుల్లోకి నీటి ప్రవాహాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఉత్తరాంధ్ర ముంపు పరిస్థితిని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# విజయవాడలో 'మిషన్ కర్మయోగి'!

- 29, 30 తేదీల్లో దక్షిణాది రాష్ట్రాల సదస్సు
- ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు
- పాల్గొననున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
- ప్రభుత్వ ఉద్యోగుల్లో నైపుణ్యాల పెంపే లక్ష్యం
- అంబేడ్కర్ కళావేదికలో 2 రోజుల పాటు వర్క్‌షాప్

**అమరావతి, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** ప్రభుత్వ ఉద్యోగుల్లో సామర్థ్య నిర్మాణం, పరిపాలనా నైపుణ్యాల పెంపు లక్ష్యంగా మిషన్ కర్మయోగిపై దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ వర్క్‌షాప్ విజయవాడలో జరగనుంది. 'సాధనా శృంఖలా' పేరిట ఈ నెల 29, 30 తేదీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో 2 రోజుల పాటు సదస్సును నిర్వహించనున్నారు. ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, సంబంధిత భాగస్వాములు ఇందులో పాల్గొననున్నారు. 29 న జరిగే ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొని సదస్సును ప్రారంభించనున్నారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కూడా హాజరుకానున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, మిషన్ కర్మయోగి ప్రతినిధులు ఇందులో ప్రసంగించనున్నారు.

**ఐగాట్ వేదిక వినియోగంపై ప్రదర్శన..**

మిషన్ కర్మయోగిలో భాగంగా ప్రభుత్వ శిక్షణ సంస్థల కెపాసిటీ బిల్డింగ్, ఉద్యోగుల నైపుణ్యం పెంపు అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తారు. ఉన్నతి కార్యక్రమం ద్వారా సామర్థ్యాల పెంపు కోసం ఐగాట్, మిషన్ కర్మయోగి వేదిక వినియోగంపై ప్రదర్శన ఇవ్వనున్నారు. మిషన్ కర్మయోగి క్వాలిటీ ఫ్రేమ్‌వర్క్, కర్మయోగి కర్తవ్య కార్యక్రమం కింద వివిధ శిక్షణా సంస్థల పాలనకు సంబంధించిన ముసాయిదాపై చర్చ జరగనుంది. అంతరాష్ట్ర బృందాల కార్యకలాపాలు, ప్రశ్నోత్తరాల ద్వారా వివిధ రాష్ట్రాల అనుభవాలు, ఉత్తమ విధానాలను పంచుకోనున్నారు.

**రాష్ట్రాల విధానాలపై ప్రజెంటేషన్లు..**

29 న ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. 10:30 గంటలకు సీఎం చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేస్తారు. అనంతరం వివిధ అంశాలపై సాంకేతిక సమావేశాలు జరుగుతాయి. సెప్టెంబర్ 30 న నిపుణుల సమావేశం, రాష్ట్రాల ప్రదర్శనలు, బృంద చర్చలతో వర్క్‌షాప్ ముగుస్తుంది. ప్రభుత్వ శిక్షణ సంస్థలు కేవలం కోర్సులు నిర్వహించే కేంద్రాలుగా కాకుండా, ఆయా శాఖల పనితీరును మెరుగుపరిచే భాగస్వాములుగా ఎదగాలన్నదే ఈ సదస్సు ప్రధాన సందేశం. పరిపాలనలో సామర్థ్యాన్ని పెంచడంతో పాటు పలు రాష్ట్రాల మధ్య ఉత్తమ విధానాలను పరస్పరం మార్చుకునేందుకు ఈ కార్యశాల కీలకంగా మారనుంది.

## నాయకత్వ లక్షణమంటే ఓటమిని స్వీకరించడమే

**అమరావతి, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా చేసిన ప్రకటన అన్ని అపోహలకు ముగింపు పలికిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు ఎస్.ఎస్. సంధూ, వివేక్ జోషి కలిసి ఇచ్చిన సంయుక్త వివరణ మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను మరోసారి చాటిచెప్పిందని కొనియాడారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన నిర్ణయాలు సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ తీసుకుంటారని సీఎం స్పష్టం చేశారు. కేవలం స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని ఆక్షేపించారు.

ఎన్నికల ఫలితాలు ఎల్లప్పుడూ ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని చంద్రబాబు తెలిపారు. బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా హుందాతనంతో స్వీకరించడమే అసలైన నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై పౌరుల నమ్మకాన్ని కాపాడటం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

# ప్రతి రైతు నష్టాన్నీ నమోదు చేయాలి!

**పిఠాపురం వరద ముంపు ప్రాంతాలపై డిప్యూటీ సీఎం పవన్ ఆరా**

**అమరావతి, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదల మూలంగా పిఠాపురం నియోజకవర్గంలో తలెత్తిన పరిస్థితులపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. భారీ వర్షాలు, వరదల ప్రభావం పడిన ప్రాంతాల్లో ప్రజలకు వెంటనే సహాయం అందించడంతో పాటు, రహదారులు, విద్యుత్ వ్యవస్థలకు జరిగిన నష్టాన్ని త్వరగా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టంపై సమగ్ర నివేదికను సిద్ధం చేసే ప్రక్రియను తక్షణం చేపట్టాలని స్పష్టం చేశారు. శనివారం అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. వ్యవసాయం, రోడ్లు-భవనాలు, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు వెళ్లి సహాయక చర్యలను వేగవంతం చేయాలని చెప్పారు. ముఖ్యంగా పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి, రైతులకు ఎదురవుతున్న సమస్యలను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలన్నారు.

**ప్రతి రైతు నష్టాన్నీ నమోదు చేయాలి..**

భారీ వర్షాలు, వరదల కారణంగా పిఠాపురం, గొల్లప్రోలు, యు. కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పంటలు నీటమునిగి దెబ్బతిన్న విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులు పవన్ దృష్టికి తీసుకువచ్చారు. వరి, పత్తి, మినుము, మొక్కజొన్న తదితర పంటలకు జరిగిన నష్టాన్ని గ్రామాల వారీగా అంచనా వేస్తున్నట్లు వివరించారు. పంట దశ, నీటిమునక తీవ్రత, దెబ్బతిన్న విస్తీర్ణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దీనిపై పవన్ స్పందిస్తూ.. రైతులకు జరిగిన పంట నష్టాన్ని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా, సమగ్రంగా అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో నమోదు చేసి, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా పూర్తి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని దిశానిర్దేశం చేశారు. జల్లూరు కల్వర్టు వద్ద పెరిగిన నీటి ప్రవాహం, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని రోడ్లు-భవనాల శాఖ అధికారులు పవన్‌కు వివరించారు. ఈ సందర్భంగా కల్వర్టు నిర్మాణంలో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కల్వర్టు పరిసర ప్రాంతాలతో పాటు సుద్దవాగు వంతెన అప్రోచ్ రోడ్డు, ఇతర రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా వంతెన పరిసర ప్రాంతాలు నీటమునిగిన నేపథ్యంలో అప్రోచ్ రోడ్డులో స్వల్ప స్థాయిలో సెటిల్మెంట్ క్రాక్ ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. లోపాన్ని గుర్తించిన వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టి పూర్తిగా సరిదిద్దినట్లు వివరించారు.





# టూరిజంలో కొత్త శకం!

- సాంకేతికత ఆధారితంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తాం
- ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక డాక్యుమెంటరీలు
- విశాఖ-చెన్నై మధ్య సముద్రంలో కార్డెలియా క్రూజ్ ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి నిమ్మల రామానాయుడు

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** తొలిసారిగా రాజమహేంద్రవరం వేదికగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. స్థానిక హుకుంపేట కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. సెప్టెంబర్ 27 న రాజమండ్రితో పాటు రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఈ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంజీరా హోటల్ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో కొత్త కార్యాచరణతో 'రాజమండ్రి డిక్లరేషన్' ను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సాంప్రదాయ పద్ధతుల్లో సాగిన పర్యాటకాభివృద్ధిని, ఇకపై పూర్తిగా సాంకేతిక ఆధారితంగా మారుస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఎక్స్‌ప్లర్జర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని.. రాష్ట్రంలోని 130 పర్యాటక ప్రాంతాల్లో 130 భాషల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ద్వారా ఆయా ప్రాంతాల సమాచారాన్ని, ప్రాశస్త్యాన్ని పర్యాటకులకు అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు.

**ఇన్ఫ్లుయెన్సర్లతో విస్తృత ప్రచారం..**

పర్యాటక ప్రాంతాలకు వచ్చే యాత్రికులు ఒకటి 2 రోజులతో సరిపెట్టకుండా, 3 నుంచి 4 రోజులు అక్కడే ఉండేలా ఆకర్షించేందుకు క్రియేటర్లు, ఇన్ఫ్లుయెన్సర్లతో ప్రత్యేక డాక్యుమెంటరీలు చేయించి ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 2027 గోదావరి పుష్కరాలే లక్ష్యంగా 'ది గోదావరి కాల్స్' పేరుతో ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం పర్యాటక శాఖాధికారులతో కలిసి రాజమహేంద్రవరం నుంచి హోప్ ఆన్ హోప్ ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

**క్రూజ్, కారవాన్ టూరిజం..**

సముద్రంలో కార్డెలియా క్రూజ్‌ను విశాఖ-చెన్నై-పాండిచ్చేరి మధ్య ఇప్పటికే ప్రారంభించామన్నారు. కాకినాడ తీరం నుంచి హోప్ ఐల్యాండ్, కోరింగ, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో మరో రివర్ క్రూజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కారవాన్ టూరిజం, హోమ్ స్టేలు, టెంట్ సిటీలతో వినూత్నంగా ముందుకు వెళ్తున్నామని వివరించారు. పర్యాటక ప్రాంతాల ప్రచారంలో సోషల్ ఇన్ఫ్లుయెన్సర్ల పాత్ర కీలకమన్న మంత్రి.. గోదావరి మాతకు ఇచ్చే హారతిని అందరూ తిలకించాలని కోరారు.

ప్రజాగళమే స్పంద జాతీయ తెలుగు దినపత్రిక

ఆదివారం, 27 సెప్టెంబర్ 2026

# ఏపీ ఐ అండ్ పీఆర్ శాఖకు అరుదైన గుర్తింపు!

- జాతీయ స్థాయిలో స్కోచ్ సిల్వర్ పురస్కారం సొంతం
- అక్రిడిటేషన్ల జారీలో అత్యంత పారదర్శకతకు దక్కిన గౌరవం
- ఏపీ డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు గోల్డ్ స్కోచ్ అవార్డు
- సిబ్బంది అంకితభావానికి, సమిష్టి కృషికే దక్కిన విజయం
- ఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో అవార్డుల ప్రదానం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** పాలనా పారదర్శకత, జవాబుదారీతనం, డిజిటల్ సేవలను అందించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలకు జాతీయ స్థాయిలో మరో అరుదైన గుర్తింపు లభించింది. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల (ఐ అండ్ పీఆర్) శాఖ మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించి ప్రతిష్టాత్మక స్కోచ్ సిల్వర్ పురస్కారాన్ని సొంతం చేసుకుంది. శనివారం న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో ఘనంగా జరిగిన 109 వ స్కోచ్ సమ్మిట్ వేదికగా ఈ గవర్నెన్స్ విభాగంలో మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించినందుకు సిల్వర్ స్కోచ్ అవార్డు దక్కింది. ఈ అవార్డును డైరెక్టర్ తరపున జాయింట్ డైరెక్టర్ ఐ. సూర్యచంద్రరావు, ఆర్ఐఈ డాక్టర్ నాగరాజ అందుకున్నారు. స్కోచ్ అధికారిక రికార్డుల్లోనూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ చేపట్టిన ఈ డిజిటల్ అక్రిడిటేషన్ విధానం పారదర్శకతకు ప్రతీకగా నమోదైంది.

### అక్రిడిటేషన్ ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు..

ఐ అండ్ పీఆర్ శాఖ డైరెక్టర్ విశ్వనాథన్ అందిస్తున్న సమర్థవంతమైన మార్గదర్శకత్వం అక్రిడిటేషన్ ప్రక్రియను డిజిటలైజ్ చేయడంలో కీలకపాత్ర పోషించింది. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జారీలో ఎలాంటి సిఫార్సులు లేకుండా, పూర్తిగా నిబంధనలకు కట్టుబడి వ్యవహరించడం విశేషం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనకు ఇస్తున్న ప్రాధాన్యానికి ఈ జాతీయ పురస్కారం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. మీడియా ప్రతినిధులకు ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, టెక్నాలజీని జోడించి త్వరితగతిన పరిశీలించడం, సకాలంలో అక్రిడిటేషన్లు అందజేయడం వంటి చర్యల ద్వారా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

### ఏపీ డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు గోల్డ్ స్కోచ్ అవార్డు..

సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్.. డిజిటల్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్ ఆఫ్ అమరావతి 'క్వాంటం వ్యాలీ' అంశంలో గోల్డ్ స్కోచ్ అవార్డును అందుకుంది. ఈ అవార్డును డిజిటల్ కార్పొరేషన్ ఈడీ రాణి సుస్మిత, స్పెషల్ ఆఫీసర్ శేషు కుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. మీడియా రంగానికి పారదర్శకమైన సేవలు అందించేందుకు చేస్తున్న కృషికి ఈ అవార్డులు లభించడం గర్వకారణమన్నారు. డిజిటల్ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో అహర్నిశలు శ్రమించిన 'టీమ్ ఐ అండ్ పీఆర్' సమిష్టి కృషికే ఈ గౌరవం దక్కిందన్నారు. ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌కు 'గోల్డ్ స్కోచ్ అవార్డు' రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంస్థ అధికారులను, సిబ్బందిని అభినందించారు.

# భయాన్ని కాదు.. భరోసాను కల్పించాలి

- కడపలో ఘనంగా 521 మంది కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్
- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత
- పోలీసు యూనిఫాం చూస్తే ప్రజలకు భరోసా కలగాలని పిలుపు
- రూ. 4,500 నుంచి రూ. 12 వేలకు కానిస్టేబుళ్ల స్టైపెండ్ పెంపు
- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన



**కడప, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** పోలీసు విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, ధైర్యం, మానవత్వం ఎంతో కీలకమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, కడప జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత అన్నారు. పోలీసు యూనిఫాం ప్రజలకు భరోసా కల్పించేలా పనిచేయాలని, పోలీసు అంటే భయం కాదు.. ప్రజలకు భరోసా అనే భావన కలిగేలా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలని ఆమె పిలుపునిచ్చారు. బాకరాపేటలోని 11 వ ఏపీఎస్పీ బెటాలియన్ పోలీసు పరేడ్ మైదానంలో శనివారం 521 మంది నూతన కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక అని మంత్రి సవిత అన్నారు. దీక్షాంత్ పరేడ్ కేవలం ఒక పరేడ్ మాత్రమే కాదని, శిక్షణార్థి నుంచి బాధ్యతాయుతమైన సిబ్బందిగా మారే కీలక ఘట్టమన్నారు. 6,100 కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీలో అనేక అడ్డంకులను అధిగమించి నియామకాలు చేపట్టామని తెలిపారు. స్టైపెండ్‌ను రూ. 4,500 నుంచి రూ. 12 వేలకు పెంచామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 21 శిక్షణా కేంద్రాల్లో సుమారు 5,800 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వంటి కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, కొత్త చట్టాలపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని సూచించారు. 9 నెలల ప్రాథమిక శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 521 మంది కానిస్టేబుళ్లు ఈ పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో కడప శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 194 మంది సివిల్, 11 వ బెటాలియన్‌కు చెందిన 327 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు. శిక్షణలో ప్రతిభ కనబర్చిన వారికి మంత్రి సవిత, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ ఆనంద్ రెడ్డి, డీఎస్పీ అబ్దుల్ కరీం, అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీ మోడల్ భేష్!

- ఏఐ ఆధారిత జీఎస్టీ అమలులో రాష్ట్రం అద్భుతం
- ఏపీ వాణిజ్య పన్నుల శాఖపై ఛత్తీస్‌గఢ్ ప్రశంసలు
- తమ రాష్ట్రంలోనూ యథాతథంగా అమలు చేస్తామని వెల్లడి
- సాంకేతిక సహకారం అందించాలని ఏపీకి విజ్ఞప్తి
- 3 రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించిన ఛత్తీస్‌గఢ్ బృందం



**అమరావతి, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** జీఎస్టీ అమలును సమర్థవంతంగా నిర్వహించడంలో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ అమలు చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఎండ్ టు ఎండ్ ట్యాక్స్ సొల్యూషన్స్ విధానం పలు రాష్ట్రాలను ఆకట్టుకుంటోంది. ఈ విధానాన్ని తమ రాష్ట్రాల్లోనూ అమలు చేయడానికి ఆయా రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తూ.. అధ్యయనం చేయడానికి ఏపీకి క్యూ కడుతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కూడా తమ రాష్ట్రంలో ఏపీ మోడల్‌ను అమలు చేయడానికి ఆసక్తి వ్యక్తం చేసింది. ఇందులో భాగంగా ఛత్తీస్‌గఢ్ పన్నుల శాఖకు చెందిన ప్రతినిధి బృందం ఏపీ వాణిజ్య పన్నుల శాఖను సందర్శించి, ఏఐ ఆధారిత జీఎస్టీ మోడల్‌ను అధ్యయనం చేస్తోంది. ఛత్తీస్‌గఢ్ ఐఆర్ఎస్ ప్రత్యేక కమిషనర్ తరన్నుమ్ వర్మ నేతృత్వంలో జాయింట్ కమిషనర్ నరేంద్ర వర్మ, డిప్యూటీ కమిషనర్లు హేమంత్ సిన్హా, ప్రకాశ్ గుప్తే, అసిస్టెంట్ కమిషనర్ పూర్వ గుప్తే, సిస్టమ్ అనలిస్ట్ రిధిమా శర్మలతో కూడిన ప్రత్యేక బృందం 3 రోజుల పాటు ఏపీలో అధ్యయనం చేసింది. ఈ బృందానికి రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు ఏ సాదర స్వాగతం పలికి.. రాష్ట్రం అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ ప్రత్యేకతల గురించి వివరించారు. 3 రోజుల పాటు ఈ బృందం ఐటీ, డేటా అనలిటిక్స్, లీగల్ ఏఐ, కేస్ మేనేజ్‌మెంట్, పన్ను ఎగవేతల నిరోధక వ్యవస్థ వంటి అంశాలపై అధికారులతో చర్చించి అధ్యయనం చేశారు. తొలిరోజు ఐటీ, డీఏసీ విభాగం అమల్లో ఉన్న ఏఐ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. రెండో రోజు ఎన్‌ఫోర్స్‌మెంట్, పన్ను ఎగవేత నిరోధక చర్యలు, సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ పనితీరు గురించి ప్రతినిధి బృందానికి వివరించారు. పన్నుల నిర్వహణ ప్రక్రియలో ఏఐ, అధునాతన డేటా అనలిటిక్స్‌ను అనుసంధానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను చీఫ్ కమిషనర్ బాబు ఏ ఛత్తీస్‌గఢ్ బృందానికి వివరించారు. క్లిష్టతరమైన పన్ను చెల్లింపుదారులను గుర్తించడానికి, అనుమానాస్పద లావాదేవీలను కనిపెట్టడానికి, విచారణ విశ్లేషణతో పాటు జీఎస్టీ చట్టం, నిర్దేశిత విధానాలకు అనుగుణంగా చట్టబద్ధమైన నోటీసులు, ఉత్తర్వుల ముసాయిదాల రూపకల్పన వరకు సమస్తం ఏఐ సహకారంతో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏఐని కేవలం డేటా విశ్లేషణ సాధనంగా కాకుండా జీఎస్టీ పరిపాలనా ప్రక్రియ మొత్తంలో సమగ్ర నిర్ణయ సహాయక వ్యవస్థగా వినియోగిస్తున్నట్లు వివరించారు. తుది పరిశీలన, ఆమోదం మాత్రం సంబంధిత సమర్థ అధికారి ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. జీఎస్టీ నిర్వహణలో ఏఐని ఎండ్ టు ఎండ్ విధానంగా ఏపీ అమలు చేస్తున్న తీరును ఛత్తీస్‌గఢ్ బృందం ప్రశంసించింది. పన్నుల నిర్వహణలో ఏఐ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, భవిష్యత్తు అవకాశాలపై రెండు రాష్ట్రాల అధికారులు విస్తృతంగా చర్చించారు. ఏపీ అభివృద్ధి చేసిన ఏఐ ట్యాక్స్ సొల్యూషన్స్‌ను తమ రాష్ట్రంలో యథాతథంగా అమలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని ఛత్తీస్‌గఢ్ బృందం తెలిపింది. దీనికి కావాల్సిన శిక్షణలో ఏపీ సహకారం కావాలని కోరింది.

# రద్దు చేయడమే కూటమి విధానమా?

**అన్నమయ్య పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టు రద్దుపై వైఎస్సార్‌సీపీ ఫైర్**

**సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే విరమించుకున్నారా అని నిలదీత**

**నందలూరు మండలంలో భారీ ప్రాజెక్టును కోల్పోయిన స్థానికులు**

**పెట్టుబడుల ప్రకటనలు వాస్తవ రూపం దాల్చడం లేదు**

**తిరుపతిలో మీడియాతో మాట్లాడిన కరుణాకర్ రెడ్డి**

**తిరుపతి, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** అన్నమయ్య జిల్లాలో ప్రతిపాదించిన రూ. 10,300 కోట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టును ఆకస్మికంగా రద్దు చేయడంపై కూటమి




ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి ప్రశ్నించారు. కేవలం 18 నెలల క్రితం భారీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను కల్పించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా ప్రచారం చేసి, ఇప్పుడు ఎందుకు ఉపసంహరించుకున్నారో వాస్తవ కారణాలు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుపతిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన భూమన.. నందలూరు మండలంలోని చింతకుంటపాలెం, మంటపంపల్లె, కొమ్మూరు గ్రామాల పరిధిలో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు గతంలో ప్రకటించారని తెలిపారు. దీని ద్వారా దాదాపు 3,000 మందికి ఉపాధి, సుమారు 2,000 మెగావాట్ల పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని అప్పట్లో పేర్కొన్నారన్నారు. రాయలసీమకు కీలకమైన ఈ ప్రాజెక్టును ఇప్పుడు పులుల సంరక్షణ ప్రాంతం సున్నితత్వం, పర్యావరణ అంశాలను కారణాలుగా చూపుతూ అర్ధరాత్రి ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా రద్దు చేయడంపై ఆయన మండిపడ్డారు. పర్యావరణపరమైన, అటవీ సంబంధిత సమస్యలు ఉంటే ప్రాజెక్టును ప్రకటించడానికి, ఆమోదించడానికి ముందే వాటిని ఎందుకు పరిశీలించలేదని భూమన ప్రశ్నించారు.

### కమిషన్ల ఒత్తిళ్ల వల్లేనా..

భారీ ఆర్భాటంతో ప్రాజెక్టులను ప్రకటించి, ఆ తర్వాత వాటిని రద్దు చేయడం కూటమి ప్రభుత్వంలో ఒక విధానంగా మారిందని భూమన విమర్శించారు. సరైన ప్రణాళిక లేకపోవడం, అవసరమైన అనుమతులు పొందడంలో వైఫల్యం, కమిషన్లకు సంబంధించిన ఒత్తిళ్లు లేదా ఇతర బహిర్గతం కాని కారణాల వల్లే ప్రాజెక్టులను విరమించుకుంటున్నారా అని ఆయన నిలదీశారు. మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ప్రచారాన్ని ప్రస్తావించిన భూమన.. పెట్టుబడుల ప్రకటనలు వాస్తవ ప్రాజెక్టులుగా మారడం లేదని ఆక్షేపించారు. టాటా ఇంగాట్, వెబ్ సోల్ వంటి సంస్థలు తమ ప్రాజెక్టులను ఇతర రాష్ట్రాలకు తరలించాయని పేర్కొన్నారు. విశాఖపట్నం భాగస్వామ్య సదస్సు కూడా వాస్తవంగా అమలవుతున్న భారీ పెట్టుబడుల కంటే ఎక్కువగా ప్రచారానికే పరిమితమైనట్లు కనిపిస్తోందని విమర్శించారు. అన్నమయ్య ప్రాజెక్టును ఎందుకు రద్దు చేశారనే దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ప్రజల ముందు అన్ని వాస్తవాలను ఉంచాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా వీఐటీ మారిషస్ తొలి వార్షికోత్సవం!

**అంతర్జాతీయ విద్యాసంస్థగా అరుదైన మైలురాయి**

**హాజరైన ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్, ప్రో-ఛాన్సలర్లు**

**వేడుకలో ప్రధాన ఆకర్షణగా ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో**

**వాస్తవ ప్రపంచ సమస్యలకు వినూత్న పరిష్కారాలు చూపిన విద్యార్థులు**

**అవార్డుల ప్రదానోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలతో ముగింపు**




**వేలూరు, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** అంతర్జాతీయ విద్యా సంస్థగా అభివృద్ధి చెందుతున్న వీఐటీ మారిషస్ తన తొలి వార్షిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. ఈ వేడుకకు వీఐటీ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్, ప్రో-ఛాన్సలర్లు డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, డాక్టర్ సంధ్యా పెంటారెడ్డి హాజరయ్యారు. మారిషస్‌లో ప్రపంచస్థాయి విద్యను బలోపేతం చేయాలన్న వీఐటీ నిబద్ధతను ఈ వేడుక ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిలిచింది. విద్యార్థులు వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను చూపే వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని ఆచరణాత్మక సమస్యలకు అన్వయించిన తీరు వారి సాంకేతిక సామర్థ్యాలను, సృజనాత్మకతను చాటింది. వీఐటీ మారిషస్ భారత్, మారిషస్, ఆఫ్రికా, మధ్యప్రాచ్య ప్రాంతాల మధ్య విద్యా, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని వక్తలు పేర్కొన్నారు.

### ఆవిష్కరణల దిశగా సాగాలి..

సభను ఉద్దేశించి డాక్టర్ జి. విశ్వనాథన్ మాట్లాడుతూ.. వీఐటీ మారిషస్ సాధించిన పురోగతి పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆవిష్కరణల దిశగా ముందుకు సాగుతూ సమాజానికి అర్థవంతమైన సేవలు అందించాలని ప్రోత్సహించారు. చివరగా విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఉత్సాహభరితమైన సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ముగిశాయి.

ప్రజాపక్షమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
ఆదివారం, 27 సెప్టెంబర్ 2026



# చైనాకు బైబై..

## భారత్ వైపు 'డేటా హైవే'!

**సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుళ్లకు మారుతున్న ప్రపంచ మార్గాలు**

**దక్షిణ చైనా సముద్రం, ఎర్ర సముద్రంపై ఆధారాన్ని తగ్గిస్తున్న టెక్ సంస్థలు**

**హిందూ మహాసముద్రం మీదుగా కొత్త కేబుల్ మార్గాలపై పెరుగుతున్న ఆసక్తి**

**ముంబైకి తోడుగా అంతర్జాతీయ అనుసంధాన కేంద్రంగా ఎదుగుతున్న చెన్నై**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** ప్రపంచ డిజిటల్ పటంలో భారత్ ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. అంతర్జాతీయ ఇంటర్నెట్ సమాచారంలో అత్యధిక భాగాన్ని మోసుకెళ్లే సముద్రగర్భ కేబుళ్లకు కొత్త మార్గాలు రూపుదిద్దుకుంటున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సముద్ర మార్గాల్లో భద్రతాపరమైన సమస్యలు, అనుమతుల్లో జాప్యాల నేపథ్యంలో కొన్ని అంతర్జాతీయ కేబుల్ ప్రాజెక్టులు దక్షిణ చైనా సముద్రం, ఎర్ర సముద్రంపై ఆధారాన్ని తగ్గించే ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నాయి. ఈ మార్పులో భారత్, ముఖ్యంగా ముంబై, చెన్నై నగరాలు కీలక అనుసంధాన కేంద్రాలుగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. దేశాల మధ్య ప్రయాణించే అంతర్జాతీయ డేటాలో అత్యధిక భాగం సముద్రగర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుళ్ల ద్వారానే వెళ్తుంది. ఉపగ్రహాలు ఇంటర్నెట్ అనుసంధానంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, భారీ స్థాయిలో డేటాను వేగంగా, తక్కువ ఆలస్యంతో తరలించడంలో సముద్రగర్భ కేబుళ్లే ప్రధాన ఆధారం. ప్రపంచ బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలు, క్లౌడ్ సేవలు, వీడియో ప్రసారాలు, ప్రభుత్వ సమాచార వ్యవస్థలు వీటిపైనే పెద్దఎత్తున ఆధారపడి ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఎర్ర సముద్ర ప్రాంతంలో భద్రతాపరమైన సమస్యలు, కేబుళ్లకు జరిగిన నష్టాలు ప్రపంచ డిజిటల్ మౌలిక వసతుల బలహీనతలను మరోసారి బయటపెట్టాయి. మరోవైపు అమెరికా–చైనా మధ్య సాంకేతిక, భద్రతాపరమైన పోటీ నేపథ్యంలో దక్షిణ చైనా సముద్రం మీదుగా వెళ్లే కొన్ని కొత్త కేబుల్ ప్రాజెక్టుల మార్గాల విషయంలోనూ పునరాలోచనలు జరుగుతున్నాయి. అయితే ప్రపంచ కేబుళ్లన్నీ చైనా మార్గాన్ని విడిచిపెడుతున్నాయని చెప్పడం కంటే, ప్రత్యామ్నాయ మార్గాల నిర్మాణం వేగం పుంజుకుంటోందని చెప్పడమే సముచితం. హిందూ మహాసముద్రానికి మధ్యలో ఉన్న భౌగోళిక స్థానం భారత్‌కు ప్రధాన బలంగా మారుతోంది. ఆసియా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, ఐరోపా ప్రాంతాలను అనుసంధానించే కొత్త సముద్రగర్భ కేబుళ్లలో భారత తీర నగరాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఇప్పటివరకు ముంబై ప్రధాన కేబుల్ ల్యాండింగ్ కేంద్రంగా ఉండగా, చెన్నై కూడా వేగంగా కీలక డిజిటల్ ద్వారంగా ఎదుగుతోంది. దీంతో దేశంలో డేటా కేంద్రాలు, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ సేవలకు అవసరమైన అంతర్జాతీయ అనుసంధానం మరింత విస్తరించే అవకాశం ఉంది. ఒకే మార్గంపై ఆధారపడకుండా అనేక కేబుళ్లు అందుబాటులోకి రావడం వల్ల నెట్‌వర్క్ స్థిరత్వం కూడా పెరుగుతుంది. కృత్రిమ మేధ, భారీ డేటా కేంద్రాలు, క్లౌడ్ సేవలు, సూపర్ కంప్యూటింగ్ విస్తరణతో ప్రపంచవ్యాప్తంగా డేటా రవాణా అవసరాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సముద్రగర్భ కేబుళ్లు కేవలం ఇంటర్నెట్ సదుపాయంగా కాకుండా దేశాల ఆర్థిక, వ్యూహాత్మక మౌలిక వసతుల్లో కీలక భాగంగా మారుతున్నాయి. ఒక సముద్రగర్భ కేబుల్ తెగినంత మాత్రాన సాధారణంగా మొత్తం ఇంటర్నెట్ నిలిచిపోదు. ప్రత్యామ్నాయ కేబుళ్లు అందుబాటులో ఉంటే డేటా ట్రాఫిక్‌ను వాటివైపు మళ్లిస్తారు. ఒక కేబుల్ విఫలమైనా సేవలు కొనసాగేలా ప్రధాన నెట్‌వర్క్‌లు అనేక మార్గాలను ఉపయోగిస్తాయి. అయితే తక్కువ కేబుల్ అనుసంధానం ఉన్న ప్రాంతాల్లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ప్రధాన కేబుల్ దెబ్బతింటే ఇంటర్నెట్ వేగం తగ్గడం, కొన్ని సేవలకు అంతరాయం ఏర్పడటం సాధ్యమే. ప్రత్యామ్నాయ మార్గమే లేని ప్రాంతాల్లో ప్రభావం మరింత తీవ్రంగా ఉండొచ్చు. అత్యవసర పరిస్థితుల్లో ఉపగ్రహ అనుసంధానం కొంతవరకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. కొత్త సముద్రగర్భ కేబుళ్లు భారత్‌ను తాకడం వల్ల కేవలం ఇంటర్నెట్ వేగమే కాదు.. డేటా కేంద్రాలు, క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ రంగాల్లో పెట్టుబడులు పెరిగేందుకు అవకాశాలు ఏర్పడతాయి. ముంబై, చెన్నై వంటి నగరాలు మరిన్ని అంతర్జాతీయ కేబుళ్లకు కేంద్రాలుగా మారితే ప్రపంచ డిజిటల్ వ్యవస్థలో భారత్ పాత్ర మరింత కీలకం కానుంది.

# అస్సాంలో సర్ బాధితులను కలుస్తా: అశుతోష్ రంకా



**ఢిల్లీ, సెప్టెంబర్ 27 :** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కోకన్వీనర్ అశుతోష్ రంకా అస్సాంలో పర్యటిస్తున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) బాధితులతో మాట్లాడతానని ఆయన తెలిపారు. శనివారం గువహాటిలో మీడియాతో ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియ కారణంగా అస్సాంలో చాలా మంది ఓటు హక్కును కోల్పోయారని, అలాంటి వారిని కలిసి మాట్లాడతానని చెపక్పారు. అలాగే ఆదివారం స్కూళ్లను కూడా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తానన్నారు. ఇందుకోసం తమ వలంటీర్లు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. 'అస్సాంలో మాకు చాలా మంది వలంటీర్లు ఉన్నారు. వారితో కలిసి అస్సాం స్కూళ్లను పరిశీలిస్తా. తర్వాత వలంటీర్లతో భేటీ అవుతా' అని అశుతోష్ పేర్కొన్నారు.

### ఈశాన్య రాష్ట్రాల్లో సీజేపీకి ఆదరణ

అస్సాంతో పాటు మిగతా ఈశాన్య రాష్ట్రాల్లోనూ తమ పార్టీ సీజేపీకి ఆదరణ పెరుగుతోందని అశుతోష్ అన్నారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ పార్టీ నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో అస్సాం నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని, అస్సాం ప్రజలు తమ ఆందోళనకు సంఘీభావం తెలిపారని ఆయన వెల్లడించారు. అస్సాం, ఇతర ఈశాన్యా రాష్ట్రాల్లో సీజేపీ చాలా వేగంగా విస్తరిస్తోందన్నారు. తమ పార్టీని ప్రారంభించినప్పటి నుంచి అస్సాం ప్రజలు తమకు మద్దతు ఇస్తూనే ఉన్నారని వివరించారు. త్వరలో అస్సాంతో పాటు మిగతా ఈశాన్యా రాష్ట్రాల్లోనూ రాష్ట్ర యూనిట్లను ప్రకటిస్తామని అశుతోష్ తెలిపారు. మెరుగైన భారత్ కోసం కృషి చేయడం, జవాబుదారీతనం తేవడం, విద్యా వ్యవస్థను ప్రక్షాళించడమే తమ పార్టీ లక్ష్యం అని ఆయన చెప్పారు.

# సీఈసీపై పోరుకు 'ఇండియా' సమాయత్తం

- సెప్టెంబర్ 30న ఢిల్లీలో కూటమి అగ్రనేతల కీలక సమావేశం
- జ్ఞానేశ్‌కుమార్ తొలగింపు డిమాండ్‌పై ఉమ్మడి వ్యూహానికి కసరత్తు
- దేశవ్యాప్త ఆందోళనలు.. తదుపరి కార్యాచరణపై చర్చించే అవకాశం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్‌పై ఉమ్మడి కార్యాచరణ రూపొందించేందుకు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సమాయత్తమవుతోంది. సెప్టెంబర్ 30న న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో కూటమి కీలక సమావేశం నిర్వహించనుంది. జ్ఞానేశ్‌కుమార్ తొలగింపునకు పార్లమెంటులో తీర్మానం తీసుకురావడం సహా అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించే అవకాశం ఉందని తాజా కథనాలు పేర్కొన్నాయి. డీఎంకే, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం సహా కూటమి భాగస్వామ్య పార్టీల అగ్రనేతలు సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉంది. తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ ఇప్పటికే కాంగ్రెస్ నాయకత్వంతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీతోనూ చర్చలు జరిగినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. సమావేశం అనంతరం ఉమ్మడి కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది.

### తొలగింపు తీర్మానంపై కసరత్తు

ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలన్న డిమాండ్‌ను మరింత ముందుకు తీసుకెళ్లడమే సమావేశంలోని ప్రధాన అంశాల్లో ఒకటిగా ఉండనుంది. ఇందుకు అవసరమైన రాజకీయ, పార్లమెంటరీ కార్యాచరణతోపాటు సంతకాల సేకరణపైనా చర్చ జరిగే అవకాశం ఉందని కథనాలు పేర్కొన్నాయి. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై అభ్యంతరాలు, ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అంశాలు, దేశవ్యాప్త నిరసనల నిర్వహణ కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

### 14 అభ్యంతరాలతో రాజుకున్న వివాదం

ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో ఓటర్ల జాబితాల చేర్పులు, తొలగింపులు, సమాచార నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి కనీసం 14 సందర్భాల్లో అభ్యంతరాలు నమోదు చేశారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పరిశోధనాత్మక కథనం వెల్లడించింది. ఈ కథనం వెలువడిన తర్వాత ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాల విమర్శలు మరింత తీవ్రమయ్యాయి. అయితే ఈ కథనంపై ఎన్నికల సంఘం భిన్నంగా స్పందించింది. కమిషన్‌లో అధికారులు, కమిషనర్లు తమ అభిప్రాయాలు, సూచనలు నమోదు చేయడం నిర్ణయ ప్రక్రియలో సహజమని, వాటిని తుది నిర్ణయాలపై విభేదాలుగా చూడరాదని పేర్కొంది. ప్రత్యేక సమగ్ర సవరణ సహా ఎన్నికల సంఘం తీసుకున్న తుది నిర్ణయాలన్నింటికీ ముగ్గురు కమిషనర్ల ఆమోదం ఉందని స్పష్టం చేసింది.

### ప్రతిపక్షాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు జ్ఞానేశ్‌కుమార్ వైదొలగాలని ఇప్పటికే డిమాండ్ చేశారు. మమతా బెనర్జీ ఈ అంశంపై పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30 సమావేశం ద్వారా విడివిడిగా సాగుతున్న ప్రతిపక్షాల నిరసనలను ఉమ్మడి కార్యాచరణగా మార్చే ప్రయత్నం జరుగుతోంది.

# ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ

- ఇంటి వద్దకే బీఎల్‌ఓలు, డాక్యుమెంట్ల ఆన్‌లైన్ అప్‌లోడ్!
- సమగ్ర సవరణలో కీలక నిర్ణయాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నోటీసులు అందుకున్న ఓటర్లకు ఊరట కలిగించేలా కేంద్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు ప్రకటించింది. నోటీసుల పరిష్కారం కోసం ఓటర్లు తప్పనిసరిగా అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటివద్దే సహాయం అందించాలని నిర్ణయించింది. బూత్ స్థాయి అధికారులు ఓటర్ల ఇళ్లకు వెళ్లి అవసరమైన పత్రాలు సేకరించి, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.

### ఇంటికే బూత్ స్థాయి అధికారి

ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసులు అందుకున్న వారికి పత్రాల సమర్పణ, వివరాల ధ్రువీకరణలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ చర్యలు చేపట్టింది. అవసరమైన సందర్భాల్లో అధికారులు ఓటర్ల ఇంటికే వెళ్లి పత్రాలు స్వీకరించనున్నారు. దీంతో ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, కార్యాలయాలకు వెళ్లలేని వారికి ప్రక్రియ సులభం కానుంది.

### పత్రాల అప్‌లోడ్ బాధ్యతా అధికారులదే

ఓటర్లు తమ నోటీసులో కోరిన సంబంధిత పత్రాలను అందిస్తే, వాటిని డిజిటల్ వ్యవస్థలో నమోదు చేయడంలో అధికారులు సహకరించనున్నారు. అవసరమైన చోట సహాయ కేంద్రాల ద్వారా కూడా నోటీసుల పరిష్కారానికి తోడ్పాటు అందించనున్నారు. నోటీసులకు స్పందించేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్గాలు అందుబాటులో ఉన్నాయి.

### ఎస్ఐఆర్ ప్రక్రియలో మార్పులు

ఎస్ఐఆర్ అమలులో ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఇటీవల విమర్శలు, ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ సౌలభ్యాలను ప్రకటించింది. నోటీసుల పరిష్కారానికి అదనపు సమయం, ఇంటివద్ద సహాయం, సహాయ కేంద్రాలు వంటి చర్యలను చేపట్టింది. ఎన్నికల సంఘం అధికారిక షెడ్యూల్ ప్రకారం వివిధ రాష్ట్రాల్లో ఇంటింటి పరిశీలన, ముసాయిదా జాబితా, అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా ప్రచురణకు వేర్వేరు గడువులు ఉన్నాయి.

# 'బంగారం కొనొద్దు'.. మోదీ మాట వింటారా?

- అత్యవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లు తగ్గించాలని ప్రధాని పిలుపు
- విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యమని వివరణ
- గణేశ్ చతుర్థి వేళ పరిమాణపరంగా 15 శాతం తగ్గిన అమ్మకాలు
- ధన్‌తేరస్, దీపావళి సీజన్‌లో అసలు పరీక్ష
- ధరల పెరుగుదలా?.. ప్రధాని పిలుపా?.. కొనుగోళ్ల తగ్గుదలకు ఏది ప్రధాన కారణం?



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** పండగ వచ్చిందంటే పసిడి కొనడం భారతీయులకు ఓ సంప్రదాయం. ధన్‌తేరస్, దీపావళి సమయంలో ఈ సెంటిమెంట్ మరింత బలంగా ఉంటుంది. అయితే ఈసారి పండగల సీజన్‌కు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన విజ్ఞప్తి ఆసక్తికర చర్చకు తెరతీసింది. అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లను తగ్గించాలని ఆయన ప్రజలను కోరారు. దిగుమతులపై ఆధారపడే బంగారం కొనుగోళ్లు తగ్గితే విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడి తగ్గుతుందన్నది ఈ పిలుపు వెనుక ప్రధాన ఆర్థిక కారణం. మోదీ మేలో చేసిన విజ్ఞప్తిని సెప్టెంబర్ 1న మరోసారి పునరుద్ఘాటించారు.

### ఎందుకు బంగారంపైనే దృష్టి?

భారత్ తన బంగారం అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో దేశ బంగారం దిగుమతుల విలువ 71.98 బిలియన్ డాలర్లకు చేరిందని గణాంకాలు చెబుతున్నాయి. బంగారం దిగుమతులకు డాలర్లలో చెల్లింపులు చేయాల్సి రావడంతో దిగుమతులు అధికమైతే వాణిజ్య లోటు, కరెంట్ ఖాతా, రూపాయి మారకం విలువపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంటుంది.

### గణేశ్ చతుర్థికి 15 శాతం తగ్గుదల

మోదీ పిలుపు తర్వాత వచ్చిన తొలి ప్రధాన పండగల సీజన్‌లో బంగారం అమ్మకాల పరిమాణం తగ్గింది. ఈ ఏడాది గణేశ్ చతుర్థి సందర్భంగా గతేడాదితో పోలిస్తే బంగారం విక్రయాలు పరిమాణపరంగా సుమారు 15 శాతం తగ్గినట్లు ఆభరణాల రంగ ప్రతినిధులు వెల్లడించారు. వినియోగదారులు తక్కువ బరువున్న ఆభరణాలవైపు మొగ్గుచూపడంతోపాటు పాత బంగారాన్ని మార్చుకొని కొత్త ఆభరణాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఈ తగ్గుదల మొత్తాన్నీ ప్రధాని పిలుపు ప్రభావంగానే చూడటం సరికాదు. గత ఏడాది గణేశ్ చతుర్థి సమయంలో 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.98 వేలుగా ఉండగా, ఈసారి ముంబై స్పాట్ మార్కెట్‌లో పన్నుతో కలిపి రూ.1.57 లక్షల వరకు చేరింది. దాదాపు 60 శాతం ధరల పెరుగుదల కొనుగోళ్ల పరిమాణం తగ్గడానికి ప్రధాన కారణాల్లో ఒకటని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. గణేశ్ చతుర్థి అమ్మకాలు ఒక సంకేతం మాత్రమే. బంగారం మార్కెట్‌కు అసలు పరీక్ష ధన్‌తేరస్, దీపావళి, ఆ తర్వాత వివాహాల సీజన్‌లో ఎదురుకానుంది. అధిక ధరల మధ్య ప్రజలు సంప్రదాయాన్ని కొనసాగిస్తారా? తక్కువ పరిమాణంతో సరిపెట్టుకుంటారా? పాత బంగారం మార్పిడికి మొగ్గుచూపుతారా? లేక పెట్టుబడి మార్గాలను ఎంచుకుంటారా? అన్నది మార్కెట్ ఆసక్తిగా గమనిస్తోంది. ప్రపంచ స్వర్ణ మండలి కూడా అధిక ధరల కారణంగా భారత బంగారం డిమాండ్ ధరల పట్ల సున్నితంగా ఉంటుందని అంచనా వేసింది.

### భౌతిక బంగారమా.. ఈటీఎఫ్‌లా?

కేవలం పెట్టుబడి కోసమే బంగారం కొనేవారికి భౌతిక ఆభరణాలతోపాటు గోల్డ్ ఈటీఎఫ్‌లు వంటి ప్రత్యామ్నాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే ఏ మార్గం 'మేలు' అన్నది పెట్టుబడిదారుడి లక్ష్యం, కాలపరిమితి, ఖర్చులు, ప్రమాదాన్ని భరించే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. అధిక ధరల నేపథ్యంలో కొందరు వినియోగదారులు తేలికపాటి ఆభరణాలు, డిజిటల్ మార్గాలు, ఈటీఎఫ్‌లవైపు చూస్తున్నట్లు మార్కెట్ కథనాలు పేర్కొంటున్నాయి.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
ఆదివారం, 27 సెప్టెంబర్ 2026

# ఇంద్రకీలాద్రికి 'శాశ్వత రక్షణ'

- కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్
- దసరా వేళ భక్తుల భద్రతే అత్యంత ప్రధానం: కె. రామచంద్ర మోహన్



**విజయవాడ, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** భారీ వర్షాలతో ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డుపై కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం దేవస్థాన అధికారులు, ఇంజినీరింగ్, సాంకేతిక నిపుణులతో కలిసి ప్రభావిత ప్రాంతాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దసరా శరన్నవరాత్రుల నేపథ్యంలో భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇటీవల వరుసగా కురిసిన భారీ వర్షాలతో ఇంద్రకీలాద్రి కొండపై నుంచి బండరాళ్లు, మట్టి ఘాట్‌రోడ్డుపైకి జారిపడ్డాయి. అయితే దసరా ఏర్పాట్లలో భాగంగా మరమ్మతుల కోసం ఘాట్‌రోడ్డును ముందుగానే మూసివేయడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఘటన అనంతరం కొండ స్థిరత్వాన్ని శాస్త్రీయంగా అంచనా వేసేందుకు బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ నిపుణులను రంగంలోకి దించారు.

### కొండకు 'రాక్ కవచం'

గతంలో రాక్ మెకానిక్స్ సంస్థ శాస్త్రవేత్తలు ఇంద్రకీలాద్రి కొండ స్థిరత్వంపై అధ్యయనం చేసి చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని శాశ్వత భద్రతా చర్యలపై కమిషనర్ సమీక్షించారు. వర్షపు నీటి ఊటతో పట్టు కోల్పోయిన వదులైన రాళ్లను శాస్త్రీయ పద్ధతిలో తొలగించడం, కొండవాలును పటిష్టం చేసేందుకు రాక్ బోల్టింగ్, షాట్‌క్రీటింగ్ వంటి పనులు చేపట్టడంపై నిపుణులతో చర్చించారు. గతంలోనూ రాక్ మెకానిక్స్ సంస్థ ఇంద్రకీలాద్రిని పరిశీలించి భద్రతా సూచనలు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

### రాళ్లు రోడ్డుపైకి రాకుండా రక్షణ నెట్లు

కొండపై నుంచి బండరాళ్లు నేరుగా ఘాట్‌రోడ్డుపైకి పడకుండా ఏర్పాటు చేసిన రక్షణ నెట్లను పరిశీలించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త రక్షణ నెట్లను ఏర్పాటు చేయడంతోపాటు రిటైనింగ్ వాల్స్, ఐరన్ ఫెన్సింగ్‌ను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ఘటన జరిగిన వెంటనే కలెక్టర్ కూడా రిటైనింగ్ వాల్, ఐరన్ ఫెన్సింగ్, రాక్‌ఫాల్ నెట్లను బలోపేతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కొండపై నుంచి వచ్చే వర్షపు నీరు రాళ్లు, మట్టి పొరల్లోకి ఇంకితే వాటిపై ఒత్తిడి పెరిగి కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉంటుందని నిపుణులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వర్షపు నీరు కొండలోకి ఇంకకుండా ప్రత్యేక డ్రైనేజీ చానళ్ల ద్వారా నేరుగా దిగువకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. భారీ వర్షాలతో కొండలోకి నీరు ఇంకడం వల్ల మట్టి, రాళ్ల పట్టు బలహీనపడినట్లు తాజా పరిశీలనల్లో అధికారులు గుర్తించారు.

దసరా మహోత్సవాల నాటికి ఘాట్‌రోడ్డు పూర్తిస్థాయిలో సురక్షితంగా ఉండేలా అన్ని సాంకేతిక, ఇంజినీరింగ్ పనులను సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. పరిశీలనలో రాక్ మెకానిక్స్ సంస్థ శాస్త్రవేత్త జైన్, దేవాదాయ శాఖ సాంకేతిక సలహాదారు సుబ్బారావు, చీఫ్ ఇంజినీర్ శేఖర్, ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్‌తోపాటు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఒంగోలులో ముగ్గురు మంత్రుల పర్యటన

### స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి నేతలతో కీలక సమావేశం




**ఒంగోలుసెప్టెంబర్ 26:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముగ్గురు రాష్ట్ర మంత్రులు నేడు ఒంగోలులో పర్యటించనున్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, బాలవీరాంజనేయస్వామి ఒంగోలులో కూటమి నేతలతో సమావేశం కానున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి నేతలతో పలు అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఒంగోలు మేయర్ అభ్యర్థితో పాటు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల ఎంపికపై సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో కూటమి నేతల సమన్వయం, ఎన్నికల సన్నద్ధత, స్థానిక రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై మంత్రులు నేతల నుంచి వివరాలు తెలుసుకోనున్నట్లు సమాచారం. మేయర్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి స్థానిక నాయకుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ఎన్నికల నిర్వహణ, ప్రచార కార్యక్రమాలు, కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం వంటి అంశాలపైనా సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. మంత్రుల పర్యటన నేపథ్యంలో ఒంగోలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# అభివృద్ధికి కేరాఫ్‌గా గుంటూరు: పెమ్మసాని

### సీఎం చంద్రబాబు సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతం



**గుంటూరు సెప్టెంబర్ 26:** గుంటూరును అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిపి చూపుతామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తోందని పెమ్మసాని తెలిపారు. రైల్వే స్టేషన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు జిల్లాలోని ఇతర మౌలిక వసతులపై కూడా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు నగరంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిల పనులపైనా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. రాబోయే ఎన్నికల సమయానికి నగరంలోని బ్రిడ్జిల నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేపడుతున్న పనులను వేగంగా పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

# స్థానిక ఎన్నికలలో కూటమి విజయానికి కృషి చేయాలి

### శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య



**చీరాల సెప్టెంబర్ 26 ( స్పంద న్యూస్ )** స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయానికి స్థానిక నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య సూచించారు. శనివారం చీరాల, రేపల్లె నియోజకవర్గాల సమన్వయ సమావేశంలో పాల్గొని శాసనసభ్యులు మాట్లాడారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులు, బూత్ స్థాయి కమిటీల బలోపేతం మరియు ప్రచార వ్యూహాలపై జిల్లా మంత్రులతో విస్తృతంగా చర్చించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేయడం జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో, సమష్టి బాధ్యతతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్, శాసనమండలి సభ్యులు, జనసేన, భారతీయ జనతా పార్టీ ఇన్‌ఛార్జులు, కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి

### ఇంచార్జ్ మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ సెప్టెంబర్ 26 స్పంద న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలపై కూటమి నేతలు సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేటర్ కందుల దుర్గేష్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా పరిస్థితులు, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల కార్యాచరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఎలక్షన్ ఇంచార్జ్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), గన్నవరం ఎమ్మెల్యే గద్దె రామమోహన్ రావు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జిల్లా పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బొలిశెట్టి శ్రీకాంత్, కోఆర్డినేషన్ కమిటీ సభ్యురాలు బండి కోమలి, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బీజేపీ స్టేట్ హెడ్‌క్వార్టర్స్ ఇంచార్జ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు తదితరులు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మూడు పార్టీల నేతలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.





# ఘనంగా ఐలమ్మ జయంతి వేడుకలు

**మంగళగిరి, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చిట్యాల ఐలమ్మ వీరోచితంగా పోరాడారని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించి, ఆమె చిత్రపటానికి బీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేసన శంకరరావు మాట్లాడుతూ నిజాం పాలన, రజాకారుల దౌర్జన్యాలు, పెత్తందారీ దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాడారని కొనియాడారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. పేద రజక కుటుంబంలో జన్మించిన ఐలమ్మ సామాజిక అసమానతలు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని అన్నారు. యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తిని యువత అందిపుచ్చుకుని సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివరాం బాబాజీ, జి. జయలక్ష్మి, బలగాని వెంకట శివరావు గౌడ్, గుర్రం ద్వారక శ్రీను, జొన్నాదుల వెంకటకృష్ణ, మంగళగిరి ప్రసాద్, ఉమామహేశ్వరరావు, దానా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీ కాలమ్ కోసం అక్టోబర్ 8న ఛలో ఢిల్లీ



**మంగళగిరి, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** జాతీయ జనగణన ఫార్మాట్‌లో ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేసి సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 8న ఢిల్లీలో జరిగే అఖిలపక్ష మేధావుల సభను విజయవంతం చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓబీసీ కులగణనపై కేంద్రం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ నెంబర్ కేటాయించి, అధికారిక కుల జాబితాల ఆధారంగా సమగ్ర కులగణన నిర్వహించాలని కోరారు. తెలంగాణ తరహాలో ఏపీ శాసనసభలో ఓబీసీ కాలమ్‌తో సమగ్ర కులగణనకు అనుకూలంగా ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని సూచించారు. అక్టోబర్ 8న ఢిల్లీలో జరిగే సమావేశానికి మేధావులు, సామాజికవేత్తలు, న్యాయ నిపుణులు, జాతీయ స్థాయి ఓబీసీ నాయకులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బీసీ నాయకులు తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుమ్మర క్రాంతి కుమార్, పారేపల్లి మహేష్, శివరాం బాబాజీ, గుర్రం ద్వారక శ్రీను, బొలగాని వెంకట శివరావు గౌడ్, జి. జయలక్ష్మి, జొన్నాదుల వెంకటకృష్ణ, మంగళగిరి ప్రసాద్, ఉమామహేశ్వరరావు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

# 28న గుంటూరులో బీజేపీ కిసాన్ మోర్చా జోనల్ సమావేశం

### సంస్థాగత బలోపేతం, రైతు సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చ



**గుంటూరు, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** భారతీయ జనతా కిసాన్ మోర్చా-ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సెప్టెంబర్ 28న ఉదయం 10 గంటలకు జోనల్ సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వై.వి. సుబ్బారావు, వి. సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సమావేశానికి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై సంస్థాగత కార్యక్రమాలు, రైతు సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు మార్గదర్శనం చేయనున్నారు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, మార్కాపురం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి జిల్లాల కిసాన్ మోర్చా నాయకులు సమావేశంలో పాల్గొననున్నారు. రాష్ట్ర పదాధికారులు, జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ సెల్స్ కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు తదితరులు హాజరవుతారు. జోనల్ పరిధిలో కిసాన్ మోర్చా సంస్థాగత కార్యక్రమాలను బలోపేతం చేయడం, జిల్లాల వారీగా కార్యక్రమాలను సమీక్షించడం, రైతు సమస్యలను గుర్తించి సంబంధిత ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లడం, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. జోనల్ పరిధిలోని అన్ని జిల్లాల నాయకులు, పదాధికారులు, ఆహ్వానితులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని వై.వి. సుబ్బారావు, వి. సురేంద్రనాథ్ రెడ్డి కోరారు.

# తిరువూరులో నర్సింగ్ హోమ్ సీజ్

### డెలివరీ అనంతరం దీప్తి మృతి.. కుటుంబ సభ్యుల ఆరోపణలు

**తిరువూరు సెప్టెంబర్ 26 స్పంద న్యూస్ ::** ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని వీఎూ సర్జికల్ అండ్ మెటర్నిటీ నర్సింగ్ హోమ్లో డెలివరీ అనంతరం దీప్తి అనే మహిళ మృతి చెందిన ఘటనపై అధికారులు చర్యలు చేపట్టారు. నర్సింగ్ హోమ్‌ను సీజ్ చేసి, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు వైద్య సేవలు అందించరాదని ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. దీప్తి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఇదే ఆస్పత్రిలో వారం రోజుల క్రితం ఆపరేషన్ అనంతరం మరో మహిళ మృతి చెందినట్లు సమాచారం. మహిళల మృతికి సంబంధించిన ఘటనల నేపథ్యంలో ఆస్పత్రిపై అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే మృతికి సంబంధించిన వైద్య కారణాలు, చికిత్సలో లోపాలపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక

ఆదివారం, 27 సెప్టెంబర్ 2026



## పారిశుధ్య నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలి

**తెనాలి,సెప్టెంబర్26(స్పంద న్యూస్)** పట్టణం లోని 9వ పారిశుధ్య డివిజన్ లోని పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. పారిశుధ్య కార్మికుల హాజరు పట్టిని పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ పట్ల కార్మికులు శ్రద్ధ వహించి, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.ప్రతి ఇంటి నుండి తడి చెత్త ,పొడి చెత్త వేరువేరుగా సేకరించే విధంగా, చెత్త రోడ్లపై ఇతర ప్రాంతాలలో వేయకుండా చూడాలని నగర దీపికలను ఆదేశించారు. వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువలలో నీటిపారుదలకు ఆటంకం లేకుండా చూడాలని, కాలువలలో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ ధారా రాజేష్, సానిటరీ సెక్రటరీలు నగర దీపికలు సిబ్బంది పాల్గొన్నారు.

## 1న రేపల్లెలో సీఎం పర్యటన

### ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ




**రేపల్లె, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 1న రేపల్లెలో పర్యటించనున్నట్లు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన వివరాలను మంత్రి వెల్లడించారు. పర్యటనలో భాగంగా సీఎం చంద్ర బాబు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. అనంతరం రేపల్లెలో నిర్వహించనున్న ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో సంబంధిత అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారించనున్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు ప్రజావేదిక సభకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రేపల్లె ప్రాంతంలో ప్రజలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉండటంతో కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

## వినాయకుడి సన్నిధిలో సుచరిత ప్రత్యేక పూజలు



**ప్రత్తిపాడు, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** ప్రత్తిపాడు మండల కేంద్రంలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. సుచరితకు ప్రత్తిపాడు నియోజకవర్గంతో సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉంది. వినాయకుడిని దర్శించుకున్న సుచరిత, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు విప్పాల కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు బాపతు వెంకటేశ్వరరెడ్డి, గుజ్జుల శివారెడ్డి, బాపతు గోవిందురెడ్డి, ఓంప్రకాశ్, మురళీ, ఫ్రాంచీస్, వాసిమళ్ల సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగులకు గ్రీవెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

**గుంటూరు, సెప్టెంబర్ 26 స్పంద న్యూస్ :** దివ్యాంగులకు, ఉద్యోగులకు, ఎస్సీ, ఎస్టీలకు నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్‌లో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. దివ్యాంగులకు, ఉద్యోగులకు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ ను శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గల ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. అభ్యర్థుల నుండి అర్జీలు స్వీకరించారు. అభ్యర్థుల విన్నపాలను ఆలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి,హెడిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తే లక్ష్యం

### నాణ్యత, నమ్మకం, సృజనాత్మకతతో వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలి: కేంద్ర మంత్రి పెమ్మసాని




**గుంటూరు, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్ ):** ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దడం, చిన్న వ్యాపారాలను ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో నిర్వహించిన ఎంఎస్ఎంఈ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ వ్యాపారవేత్తలు ఉత్పత్తుల నాణ్యత, నమ్మకం, సృజనాత్మకత, విలువ జోడింపు, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తొలి దశలోనే నాణ్యత విషయంలో రాజీపడకుండా బలమైన బ్రాండ్‌ను నిర్మించుకోవాలన్నారు. డిజిటల్ మాధ్యమాలు, ఈ-కామర్స్ ద్వారా స్థానిక ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లాలని సూచించారు. గుంటూరులో లభించే మిర్చి, పత్తి వంటి వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించుకోవచ్చన్నారు. కలెక్టర్ సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 1.46 లక్షలకు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను ప్రోత్సహించే కార్యక్రమానికి గుంటూరు నుంచే బలమైన అడుగు పడాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ పథకాలు, రుణాలు, ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించడమే వర్క్‌షాప్ ఉద్దేశమన్నారు. సీఐఐ ఏపీ చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 9.3 లక్షలకు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయని, వాటిని ఆధునిక సాంకేతికతతో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతికతలను వ్యాపారాల్లో వినియోగించుకోవాలని సూచించారు. పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమం విజయవంతం కావడం ద్వారా ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్తలు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుంటూరు నగర మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్, ఏపీ ఎంఎస్ఎంఈ సీఈఓ విశ్వ, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వందనా దేవి, అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# గడ్డిపాడు ఆర్‌ఓబీకి శంకుస్థాపన

- రూ.147.36 కోట్లతో నిర్మాణం!
- రోజుకు 78 రైళ్లు, 20 వేలకుపైగా వాహనాల రాకపోకలకు తగ్గనున్న తీవ్ర ట్రాఫిక్ కష్టాలు
- గుంటూరు జిల్లాకు 8 ఆర్‌ఓబీలకు రూ.750 కోట్ల కేంద్ర నిధులు: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



**గుంటూరు, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** గుంటూరు నగరంలోని గడ్డిపాడు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రూ.147.36 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణానికి శనివారం అత్యంత వైభవంగా శంకుస్థాపన జరిగింది. ఇన్నర్ రింగ్ రోడ్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్న ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నజీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో కేంద్ర మంత్రులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రజా చైతన్యానికి నిలయమైన గుంటూరు అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో రూ.750 కోట్ల అంచనా వ్యయంతో 8 రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపేలా చొరవ తీసుకున్నామని వెల్లడించారు. గడ్డిపాడు రైల్వే గేటు మీదుగా ప్రతిరోజూ 78 రైళ్లు, 20 వేలకుపైగా వాహనాలు ప్రయాణిస్తుండటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ ఆర్‌ఓబీ పూర్తయితే సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. అలాగే నందివెలుగు ఆర్‌ఓబీని రాబోయే దీపావళికి, శంకర్ విలాస్ బ్రిడ్జిని వచ్చే ఏడాది ప్రారంభించేలా చర్యలు వేగవంతం చేశామని, 2018లో మంజూరై గత పాలనలో నిలిచిపోయిన నెహ్రూనగర్ ఆర్‌ఓబీని కూడా తిరిగి పట్టాలెక్కించామని వివరించారు.

### ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే రంగానికి రూ.68 వేల కోట్లు

మరో కేంద్ర మంత్రి వి.సోమన్న మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏపీలో 38 రైల్వే ప్రాజెక్టుల కోసం రూ.68 వేల కోట్లు కేటాయించామని, అమృత్ భారత్ పథకం కింద 78 స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక చొరవతో గుంటూరు జిల్లాకు ఒకేసారి 8 ఆర్‌ఓబీలు రావడం శుభపరిణామమని కొనియాడారు. అనంతరం తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ.. గడ్డిపాడు ఆర్‌ఓబీ వల్ల 2 నుంచి 3 లక్షల మంది ప్రజలకు ట్రాఫిక్ రహిత రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, బూర్ల రామాంజనేయులు, సౌత్ కోస్టల్ రైల్వే జీఎమ్ సందీప్ మాతూర్, డీఆర్ఎం సుధేష్ణ సేన్ తదితర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గొట్టిపాడులో అంగన్‌వాడీ ఉత్సవం

- మాతా, శిశు సంక్షేమ పథకాలపై అవగాహన



**ప్రత్తిపాడు, సెప్టెంబర్ 26 స్పంద న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న లిలి'సేవా సంకల్ప్ అభియాన్'లిలిలో భాగంగా ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కఠారి దత్త ప్రసాద్ సాగర్, మండల కార్యదర్శి గుంటుపల్లి తులసీరామ్, గట్టుపల్లి అప్పారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్, హెల్త్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దత్త ప్రసాద్ మాట్లాడుతూ మాతృవందన యోజన ద్వారా గర్భిణీలు, బాలింతలకు ఆర్థిక సహాయం అందిస్తూ పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పోషణ్ అభియాన్ ద్వారా చిన్నారుల ఆరోగ్యం, పోషణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సురక్షిత ప్రసవాలు, తల్లులు-శిశువులకు ఉచిత వైద్య సేవల కోసం సుమన్ (సాఖహీూచీ), జనని సురక్ష, పిల్లలకు టీకాల ద్వారా రక్షణ కల్పించేందుకు మిషన్ ఇంద్రధనుస్సు వంటి పథకాలు అమలులో ఉన్నాయని వివరించారు. ఆడబిడ్డల రక్షణ, సంక్షేమం కోసం బేటీ బచావో కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. తల్లిదండ్రులను కోల్పోయిన, సంరక్షణకు నోచుకోని, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న పిల్లల కోసం మిషన్ వాత్సల్య పథకం అమలులో ఉందని దత్త ప్రసాద్ తెలిపారు. అర్హులైన పిల్లలకు ఈ పథకం ద్వారా అందే సహాయంపై మహిళలకు వివరించారు. అంగన్‌వాడీ ఉత్సవంలో భాగంగా మాతా, శిశు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పథకాల ద్వారా ప్రయోజనం పొందడంలో ఎదురవుతున్న సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. తల్లులు, చిన్నారుల ఆరోగ్యం, పోషణకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల వివరాలు సిద్ధంగా ఉంచాలి

**గుంటూరు, సెప్టెంబర్ 26 ( స్పంద న్యూస్ ) :** స్థానిక సంస్థల ఎన్నికల సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు తాజాపరుస్తూ సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. మునిసిపల్ కమిషనర్లు జిల్లా పంచాయతీ అధికారి తదితరులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల వివరాలు పై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్‌స్టేషన్ల వివరాలు సిద్ధం చేయడం జరిగిందని అదే రీతిలో మునిసిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో సిద్ధం చేసి ఉంచాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు జారీ చేస్తున్న ఆదేశాలను, మార్గదర్శకాలను పాటించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాగళమే
స్పందన
జాతీయ తెలుగు దినపత్రిక

ఆదివారం, 27 సెప్టెంబర్ 2026






# కబడ్డీలో డబుల్ గోల్డ్

- ఆసియా క్రీడల్లో మహిళలు, పురుషుల జట్లకు పసిడి పతకాలు • ఫైనల్‌లో ఇరాన్‌ను చిత్తుచేసిన భారత్
- షూటింగ్, మారథాన్, షాట్‌పుట్‌లో రజతం • స్క్వాష్‌లో రజతం, కాంస్యం
- స్క్వాష్ మహిళల సింగిల్స్‌లో ఫైనల్‌కు అనహత్, పురుషుల సింగిల్స్‌లో అభయ్
- మిక్స్‌డ్ డబుల్స్‌లో జోష్నా చిన్నప్ప–చేలవన్ సెంథిల్‌కుమార్ జోడీకి కాంస్యం • సెమీస్‌కు పురుషుల హాకీ జట్టు



**నాగోయా:** ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లు స్వర్ణ గర్జన చేశాయి. శనివారం జరిగిన ఫైనల్స్‌లో మహిళలు, పురుషుల జట్లు ఇరాన్‌ను ఓడించి పసిడి పతకాలు సాధించాయి. ఇదే సమయంలో మారథాన్‌లో సావన్ బర్వాల్, షూటింగ్‌లో మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ టీమ్, షాట్‌పుట్‌లో తజీందర్‌పాల్ సింగ్ తూర్ రజతాలు సాధించారు. స్క్వాష్‌లో అనహత్ సింగ్, అభయ్ సింగ్ సింగిల్స్ ఫైనల్‌కు చేరగా.. జోష్నా చిన్నప్ప–చేలవన్ సెంథిల్‌కుమార్ జోడీ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్యం గెలిచింది. పురుషుల హాకీ జట్టు కూడా సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. దీంతో భారత్ పతకాల సంఖ్య 30కి చేరింది. ఇందులో నాలుగు స్వర్ణాలు, 12 రజతాలు, 14 కాంస్యాలు ఉన్నాయి.

## స్వర్ణ గర్జన

ఇరాన్ నుంచి గట్టి పోటీ ఎదురైనా భారత పురుషుల జట్టు 40–34తో విజయం సాధించింది. మహిళల జట్టు 37–34తో ఇరాన్‌ను ఓడించి స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. పురుషుల కబడ్డీలో భారత్‌కు ఇది తొమ్మిదో ఆసియా క్రీడల స్వర్ణం కాగా.. మహిళల విభాగంలో నాలుగో పసిడి పతకం. ఇక హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన 28ఏళ్ల సావన్ బర్వాల్ 42.195 కిలోమీటర్ల మారథాన్‌ను 2 గంటల 11 నిమిషాల 37 సెకన్లలో పూర్తి చేసి రజతం సాధించాడు. ఈ క్రమంలో తన జాతీయ రికార్డును మెరుగుపర్చాడు. జపాన్‌కు చెందిన ఇచిటకా యమషితా స్వర్ణం, చైనాకు చెందిన పెయియూ ఫెంగ్ కాంస్యం సాధించారు. ఆసియా క్రీడల మారథాన్‌లో 1982 తర్వాత భారత్‌కు లభించిన తొలి పతకం ఇదే. 1951లో ఛోటా సింగ్, సూరత్ సింగ్ మాథుర్ తర్వాత ఈ విభాగంలో పతకం సాధించిన నాలుగో భారతీయుడిగా సావన్ నిలిచాడు. షూటింగ్‌లో మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ టీమ్ విభాగంలో తిలోత్తమ సేన్, విదర్శా వినోద్, ఆషి చౌక్సేలతో కూడిన భారత జట్టు 1763 పాయింట్లతో రజతం గెలిచింది. చైనా 1773 పాయింట్లతో గేమ్స్ రికార్డుతో స్వర్ణం సాధించగా.. కజకిస్థాన్ 1754 పాయింట్లతో కాంస్యం దక్కించుకుంది. వ్యక్తిగత విభాగంలో తిలోత్తమ నాలుగో, విదర్శా ఐదో స్థానంలో నిలిచారు.

## అదరగొట్టిన అనహత్, అభయ్

మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో 18ఏళ్ల అనహత్ సింగ్ 0–2తో వెనుకబడినప్పటికీ వరుసగా మూడు గేమ్‌లు గెలిచి జపాన్‌కు చెందిన ప్రపంచ ఆరో ర్యాంకర్ సటోమి వతనాబేపై 3–2తో విజయం సాధించింది. దీంతో ఫైనల్‌కు చేరింది. పురుషుల సింగిల్స్‌లో అభయ్ సింగ్ పాకిస్థాన్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్‌ను 3–0తో ఓడించి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్నాడు. వీరిద్దరూ ఫైనల్లో గెలిస్తే స్వర్ణంతో పాటు 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశం ఉంటుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో జోష్నా చిన్నప్ప–చేలవన్ సెంథిల్‌కుమార్ జోడీ కాంస్యంతో సరిపెట్టుకుంది. విలువిద్యలో పురుషుల రికర్వ్ వ్యక్తిగత క్వాలిఫికేషన్‌లో ధీరజ్ బొమ్మదేవర 698 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఆసియా క్రీడల క్వాలిఫికేషన్ రికార్డు నెలకొల్పాడు. మహిళల కాంపౌండ్ క్వాలిఫికేషన్‌లో చికితా తనిపర్తి 705 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్‌లోనూ భారత్ మొదటి స్థానంలో నిలిచింది.




## బ్యాడ్మింటన్‌లో మిశ్రమ ఫలితాలు

మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది. మలేషియాకు చెందిన లింగ్ చింగ్ వాంగ్, ప్రపంచ ఆరో ర్యాంకర్ ఇండోనేషియా క్రీడాకారిణి పుత్రి కుసుమ వార్దానిని ఓడించింది. తదుపరి రౌండ్‌లో జపాన్ స్టార్ అకానె యమగుచితో తలపడనుంది. మహిళల డబుల్స్‌లో ట్రీజా జాలీ–గాయత్రి గోపీచంద్ జోడీ జపాన్ ప్రపంచ మూడో ర్యాంక్ జోడీ మత్సుమోటో–ఫుకుషిమాపై విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి ఓటమితో నిష్క్రమించారు. హాకీలో పురుషుల జట్టు జపాన్‌ను 2–0 తేడాతో ఓడించి సెమీఫైనల్‌కు చేరింది.

## టేబుల్ టెన్నిస్‌లో ముగిసిన పోరు

మహిళల సింగిల్స్‌లో యశస్విని ఘోర్పడే, పురుషుల సింగిల్స్‌లో మానుష్ షా ప్రీ–క్వార్టర్‌ఫైనల్లో ఓటమిపాలయ్యారు. దీంతో టేబుల్ టెన్నిస్‌లో భారత్ పోరు ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మానుష్ షా–దియా చితలే సాధించిన కాంస్యమే భారత్‌కు లభించింది. ఈ–స్పోర్ట్స్, ఫెన్సింగ్, కానోయింగ్‌లోనూ భారత క్రీడాకారులకు ఆశించిన ఫలితాలు దక్కలేదు. అథ్లెటిక్స్‌లోనూ మిశ్రమ ఫలితాలే వచ్చాయి. మహిళల 400 మీటర్లలో ప్రాచి కాంస్యం సాధించింది. పురుషుల షాట్‌పుట్‌లో రెండుసార్లు ఆసియా క్రీడల చాంపియన్ తజీందర్‌పాల్ సింగ్ తూర్ 20.64 మీటర్ల సీజన్ బెస్ట్‌తో రజతం గెలిచాడు. కీలక పతక ఆశలు పెట్టుకున్న జ్యోతి యర్రాజి, ట్రిపుల్ జంపర్ ప్రవీణ్ చిత్రవేల్ పాత గాయాలు తిరగబెట్టడంతో పోటీలకు దూరమయ్యారు. పురుషుల 400 మీటర్లు, మహిళల 1500 మీటర్లలో భారత క్రీడాకారులు టాప్–3లో నిలవలేకపోయారు.

# ఇదే నా చివరి ప్రపంచకప్

- టైటిల్ సాధించడమే ప్రధాన లక్ష్యం
- టీ20 కంటే 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఆట తీవ్రత ఎక్కువగా ఉంటుంది
- అందుకోసం శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తా
- టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ



**తిరువనంతపురం:** వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్ భారత్ తరఫున తనకు చివరిదని స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రకటించాడు. ప్రపంచకప్ టైటిల్ సాధించడమే తన ప్రధాన లక్ష్యమని, అందుకోసం ఏం చేయాల్సి వచ్చినా సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. ఆదివారం వెస్టిండీస్‌తో ప్రారంభమయ్యే వన్డే సిరీస్ నేపథ్యంలో జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లీ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'భారత్ తరఫున నేను ఆడబోయే చివరి ప్రపంచకప్ ఇదే. అదే నాకు ప్రేరణ. ప్రపంచకప్ గెలవడమే ప్రధాన లక్ష్యం. అందుకోసం శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తా'' అని కోహ్లీ అన్నాడు. ప్రస్తుతం ఒకే ఫార్మాట్‌లో కొనసాగుతున్న 37 ఏళ్ల కోహ్లీ.. 2011లో మహేంద్రసింగ్ ధోనీ నాయకత్వంలో ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. 50 ఓవర్ల ప్రపంచకప్‌లో ఆట తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని కోహ్లీ పేర్కొన్నాడు. టీ20 స్థాయి తీవ్రతతో 10 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుందని, ఒక్కో మ్యాచ్‌లోనే రెండున్నర టీ20 మ్యాచ్‌లతో సమానమైన శ్రమ ఉంటుందని వివరించాడు. అలాంటి తీవ్రతను 10 మ్యాచ్‌ల పాటు కొనసాగించడం, అందులోనూ విదేశీ పరిస్థితుల్లో ఆడటం ఎంతో కష్టమని చెప్పాడు.

## ఆడుతున్నంత కాలం లక్ష్యంపైనే దృష్టి: రోహిత్

మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ప్రపంచకప్‌పై తన ఆశలను వెల్లడించాడు. తాను చేయాల్సిన పని పూర్తయిందనే ఆలోచన ఎప్పటికీ రాదని, ఆడుతున్నంత కాలం ముందున్న లక్ష్యాలపైనే దృష్టి ఉంటుందని చెప్పాడు. ప్రపంచకప్, ఐసీసీ టోర్నీల్లో భిన్న ప్రత్యర్థులు, వేదికలు ఎదురవుతాయని, వాటికి అనుగుణంగా విభిన్నంగా సిద్ధం కావాల్సి ఉంటుందని రోహిత్ పేర్కొన్నాడు.

# యువతకు ఛాన్స్.. రోకోకు పరీక్ష!

- ప్రపంచకప్ సన్నాహాల్లో తొలి అడుగు
- నేటి నుంచి వెస్టిండీస్‌తో వన్డే సిరీస్
- యశస్వి జైస్వాల్‌కు చోటుపై ఆసక్తి
- 15వేల వన్డే పరుగుల మైలురాయికి చేరువలో కోహ్లీ




**తిరువనంతపురం:** వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ నేపథ్యంలో యువ ఆటగాళ్లకు తగిన మ్యాచ్ సమయం ఇవ్వడం, సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సన్నద్ధతను అంచనా వేయడంపై భారత్ దృష్టి పెట్టింది. వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఆదివారం ఇక్కడ జరగనుంది. ప్రపంచకప్‌కు ముందు భారత్ 14 నుంచి 20 వన్డేలు ఆడే అవకాశం ఉండటంతో తుది జట్టును సిద్ధం చేసుకునేందుకు ప్రతి మ్యాచ్‌నూ కీలకంగా భావిస్తోంది. ఇక యశస్వి జైస్వాల్ విషయంలో జట్టు యాజమాన్యం నిర్ణయం ఆసక్తికరంగా మారింది. గాయం కారణంగా కోహ్లీ దూరమైన సమయంలో అఫ్గానిస్థాన్‌తో మూడు మ్యాచ్‌లు ఆడిన జైస్వాల్.. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో కోహ్లీ తిరిగి రావడంతో జట్టులో చోటు కోల్పోయాడు. ఇప్పుడు శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ ఆసియా క్రీడల కోసం జపాన్‌లో ఉండటంతో జైస్వాల్‌కు మళ్లీ అవకాశం వచ్చింది. రోహిత్‌తో కలిసి అతడిని ఓపెనింగ్‌కు పంపాలా.. రోహిత్–శుభ్‌మన్ గిల్ జోడీనే కొనసాగించాలా అన్నది తేలాల్సి ఉంది.

## రోహిత్, విరాట్‌పై ప్రత్యేక దృష్టి

ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో అద్భుత సెంచరీతో రోహిత్ తన ఫామ్‌ను చాటుకున్నాడు. వెస్టిండీస్‌పై కూడా భారీ ఇన్నింగ్స్‌లు ఆడాలని అతడు పట్టుదలగా ఉన్నాడు. మరోవైపు కోహ్లీ 15వేల వన్డే పరుగుల మైలురాయికి 51 పరుగుల దూరంలో ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం నెట్స్‌లో రోహిత్, కోహ్లీ సుమారు 20 నిమిషాల పాటు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయడం వారి ఉత్సాహాన్ని సూచించింది.

## యువ పేసర్లకు అనుభవమే కీలకం

గుర్నూర్ బ్రార్, అకీబ్ నబీ ఇటీవల వివిధ స్థాయిల్లో ఆకట్టుకున్నారు. అయితే పూర్తిస్థాయి ఆటగాళ్లుగా ఎదగాలంటే మరింత అంతర్జాతీయ మ్యాచ్ అనుభవం అవసరమని బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ పేర్కొన్నాడు. ప్రస్తుతం బ్రార్ ఎకానమీ రేటు సుమారు ఏడుగా ఉండటంతో దానిని మెరుగుపర్చుకోవాల్సి ఉంది. ఇదిలాఉంటే స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మరోసారి గాయపడటంతో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి ప్రాధాన్యం పెరిగింది. బ్యాటింగ్‌లో పరిణతి చూపుతున్నా.. బౌలింగ్‌లో ఇంకా మెరుగుపడాల్సి ఉంది. ఆరు వన్డేల్లో ఇప్పటివరకు మొత్తం 10 ఓవర్లు కూడా పూర్తి చేయని నితీశ్‌కు ఈ సిరీస్‌లో సుదీర్ఘ స్పెల్ వేసే అవకాశం లభించొచ్చు. ఆల్‌రౌండర్ స్థానానికి పోటీ పడేలా అతడిని తీర్చిదిద్దేందుకు సమయం ఉందని మోర్కెల్ చెప్పాడు.

## ఆర్థిక ఇబ్బందుల్లో విండీస్

న్యూజిలాండ్, శ్రీలంక చేతుల్లో స్వదేశంలో వరుస వన్డే సిరీస్‌లను స్వల్ప తేడాలతో కోల్పోయిన వెస్టిండీస్ ఈ నిరాశను అధిగమించి బరిలోకి దిగుతోంది. ఆర్థిక స్థిరత్వం కోసం క్రికెట్ వెస్టిండీస్ ఇటీవల ఆటగాళ్ల వేతనాల్లో 25 శాతం కోత విధించింది. ఈ పరిస్థితులను అధిగమించి ఆ జట్టు ఏ స్థాయిలో పోటీ ఇస్తుందన్నది సిరీస్‌లో కీలకం కానుంది.



# Business బిజినెస్

## డీహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు పెంపు

- 2027 జనవరి నుంచి అమల్లోకి
- ద్రవ్యోల్బణం, కరెన్సీ మార్పులు, నిర్వహణ వ్యయాల నేపథ్యంలో సవరణ

**ముంబై:** అంతర్జాతీయ ఎక్స్‌ప్రెస్ సేవల సంస్థ డీహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ భారత్‌లో తన ధరలను 8.9 శాతం పెంచనున్నట్లు ప్రకటించింది. సవరించిన ఛార్జీలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, కరెన్సీ మార్పులు, ఇంధన వ్యయాలు, నిబంధనల అమలు, కస్టమ్స్, భద్రతా చర్యలకు సంబంధించిన ఖర్చులు పెరగడంతో ఏటా ధరలను సవరించాల్సి వస్తోందని సంస్థ పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వ్యయాల పెరుగుదల కూడా నిర్వహణ ఖర్చులపై ప్రభావం చూపుతోందని తెలిపింది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు విమానాల ఆధునీకరణ, మౌలిక వసతుల విస్తరణ, డిజిటల్ సాంకేతికత, కార్యకలాపాల స్థిరత్వంపై భారీగా పెట్టుబడులు పెడుతున్నట్లు డీహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ తెలిపింది. 28 బోయింగ్ 777 కార్గో విమానాల సముదాయాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మరింత ఇంధన సామర్థ్యం కలిగిన విమానాలను ప్రవేశపెట్టినట్లు పేర్కొంది.




### భద్రత, సాంకేతికతకు ప్రాధాన్యం

2026లో ప్రపంచవ్యాప్తంగా 500కు పైగా టీఏపీఏ ధ్రువీకరించిన కేంద్రాలను అధిగమించినట్లు సంస్థ వెల్లడించింది. సైబర్ భద్రత, వ్యవస్థల స్థిరత్వం, సరుకు రవాణా పర్యవేక్షణ, కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచేందుకు సాంకేతిక మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపింది. కృత్రిమమేధ ఆధారిత డిజిటల్ సేవలు, మైఎక్స్‌ప్రెస్ వేదిక ద్వారా సరిహద్దులు దాటి సరుకు రవాణాను సులభతరం చేస్తున్నట్లు పేర్కొంది.

## కొత్తరూపంలో మ్యాక్‌డోవెల్స్ నెం.1

- 125 ఏళ్ల నాటి విస్కీ బ్రాండ్ పునర్వ్యవస్థీకరణ
- స్కాచ్, భారతీయ మాల్ట్‌లతో కొత్త మిశ్రమం
- నాణ్యత, అనుభూతికి సంస్థ పెద్దపీట




**న్యూఢిల్లీ:** ప్రముఖ మద్యం తయారీ సంస్థ డియాజియో ఇండియా తన 125 ఏళ్ల నాటి విస్కీ బ్రాండ్ మ్యాక్‌డోవెల్స్ నంబర్ వన్‌ను పూర్తిగా పునర్వ్యవస్థీకరించింది. మాస్–ప్రీమియం విభాగంలో బ్రాండ్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు కొత్త తరం చట్టబద్ధ వయసున్న వినియోగదారులను ఆకర్షించే లక్ష్యంతో కొత్త రూపాన్ని తీసుకొచ్చినట్లు సంస్థ తెలిపింది. ఎంపిక చేసిన దిగుమతి స్కాచ్, భారతీయ మాల్ట్‌లు, ప్రీమియం గ్రెయిన్ స్పిరిట్స్‌తో కొత్త మిశ్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించింది. ఎంపిక చేసిన ఓక్, అమెరికన్ బ్యారెళ్లలో పరిపక్వం చేసిన విస్కీని భారత్, స్కాట్‌లాండ్‌లలో మిళితం చేసినట్లు పేర్కొంది. బాటిల్ రూపకల్పనతోపాటు బ్రాండ్ దృశ్య గుర్తింపును కూడా ఆధునికంగా మార్చింది. ఏటా 30 మిలియన్లకు పైగా కేసులు విక్రయించే మ్యాక్‌డోవెల్స్ నంబర్ వన్.. వినియోగదారుల అభిరుచుల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మాస్–ప్రీమియం విస్కీ విభాగాన్ని పునర్నిర్వచించేందుకు ప్రయత్నిస్తున్నట్లు డియాజియో తెలిపింది. ముఖ్యంగా కొత్త తరం వినియోగదారులు ధర కంటే నాణ్యత, తయారీ నైపుణ్యం, వినియోగ అనుభూతికి ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఈ కొత్త గుర్తింపును రూపొందించినట్లు పేర్కొంది.

### 11 మార్కెట్లలో అధ్యయనం

పునర్వ్యవస్థీకరణకు ముందు 11 మార్కెట్లలో 10 వేల మందికి పైగా వినియోగదారులతో అధ్యయనం నిర్వహించినట్లు సంస్థ తెలిపింది. నేటి విస్కీ వినియోగదారులకు విలువ అంటే కేవలం అందుబాటు ధర మాత్రమే కాదని, నాణ్యత, తయారీ నైపుణ్యం, అనుభవం కూడా కీలకమని డియాజియో ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రుచిరా జైట్లీ తెలిపారు. మ్యాక్‌డోవెల్స్ నంబర్ వన్ పునఃప్రారంభం దేశ మాస్–ప్రీమియం విస్కీ విభాగ భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

## కేరళ లాటరీలో రూ.30 కోట్ల జాక్‌పాట్

- కన్నూర్‌లో విక్రయించిన టికెట్‌కు తొలి బహుమతి
- టీఎల్ 360615 నంబర్‌కు దక్కిన అదృష్టం.. విజేత వివరాలు గోప్యం

**తిరువనంతపురం:** కేరళ తిరువోణం బంపర్ లాటరీలో రూ.30 కోట్ల తొలి బహుమతి కన్నూర్ జిల్లాలోని చక్కరక్కల్‌లో విక్రయించిన టికెట్‌కు దక్కింది. టీఎల్ 360615 నంబర్ టికెట్ విజేతగా నిలిచిందని లాటరీ శాఖ అధికారులు శనివారం తెలిపారు. అయితే విజేత ఎవరన్నది ఇంకా తెలియరాలేదు. తిరువనంతపురంలోని గోర్కీ భవన్‌లో జరిగిన డ్రాలో ఆరోగ్యశాఖ మంత్రి కె. మురళీధరన్ విజేత టికెట్‌ను తీశారు. ఒక్కో టికెట్ ధర రూ.500 కాగా, ఈ ఏడాది 90 లక్షల టికెట్లు ముద్రించగా అన్నీ అమ్ముడయ్యాయి.

### రెండో బహుమతి రూ.కోటి

రెండో బహుమతిగా 20 మందికి ఒక్కొక్కరికి రూ.కోటి, మూడో బహుమతిగా మరో 20 మందికి రూ.25 లక్షల చొప్పున అందించనున్నారు. నాలుగో బహుమతి కింద 10 మందికి రూ.5 లక్షలు, ఐదో బహుమతిగా 10 మందికి రూ.2 లక్షల చొప్పున లభిస్తాయి. ఇతర బహుమతులుగా రూ.5 వేలు, రూ.2 వేలు, రూ.1,000, రూ.500 ఉన్నాయి. మరో తొమ్మిది మందికి రూ.5 లక్షల చొప్పున కన్సొలేషన్ బహుమతి ఇవ్వనున్నారు.

## అన్మోల్ ఇండస్ట్రీస్ రూ.1,800 కోట్ల ఐపీఓ

- సెబీకి డీఆర్‌హెచ్‌పీ దాఖలు

**కోల్‌కతా:** కోల్‌కతాకు చెందిన అన్మోల్ ఇండస్ట్రీస్ రూ.1,800 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు సిద్ధమైంది. ఈ మేరకు సెబీకి డీఆర్‌హెచ్‌పీ దాఖలు చేసింది. ఒక్కో షేరు ముఖ విలువ రూ.5 కాగా, మొత్తం ఐపీఓ ప్రమోటర్ సంస్థ బైజ్‌నాథ్ చౌధరి అండ్ ఫ్యామిలీ ట్రస్ట్ చేపట్టే ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్)గా ఉంటుంది. కంపెనీ కొత్త షేర్లు జారీ చేయనందున ఐపీఓ ద్వారా వచ్చిన నిధులు సంస్థకు అందవు. బుక్ బిల్డింగ్ విధానంలో జరిగే ఆఫర్‌లో నికర వాటాల్లో 50 శాతం వరకు అర్హత కలిగిన సంస్థాగత కొనుగోలుదారులకు, కనీసం 15 శాతం సంస్థాగతేతర బిడ్డర్లకు, 35 శాతం రిటైల్ పెట్టుబడిదారులకు కేటాయించనున్నారు.

బిస్కెట్లు, కుకీలు, కేక్‌లను తయారు చేసే కంపెనీకి ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశాల్లో ఏడు తయారీ కేంద్రాలు ఉన్నాయి. 2026 మార్చి నాటికి బిస్కెట్లు, కుకీల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 3,60,965 టన్నులు, కేక్‌ల సామర్థ్యం 16,372 టన్నులుగా ఉంది. 2026 ఆర్థిక సంవత్సరంలో కుటుంబ ప్యాక్ ఉత్పత్తులు కంపెనీ ఉత్పత్తుల విక్రయ ఆదాయంలో 23.85 శాతం వాటాతో రూ.485.5 కోట్ల ఆదాయాన్ని అందించాయి. నాణ్యత నియంత్రణ, ఆహార భద్రతకు సంబంధించిన పలు ధ్రువపత్రాలు కంపెనీకి ఉన్నాయి. 2018లో ఐపీఓకు చేసిన ప్రయత్నం తర్వాత అన్మోల్ మరోసారి పబ్లిక్ మార్కెట్‌లోకి వస్తోంది.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
ఆదివారం, 27 సెప్టెంబర్ 2026



# 'ది ప్యారడైజ్'లో కాయదు లోహార్‌కు షాక్!

కన్నడ చిత్రం 'ముగిల్‌పేట'తో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన హీరోయిన్ కాయదు లోహార్.. తొలి చిత్రంతోనే తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత తెలుగులో 'అల్లూరి' చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీకి వరుసగా అవకాశాలు వస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు మాత్రం దక్కడం లేదు. ఇటీవల ఆమె నటించిన 'ఫంకీ' చిత్రం కూడా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. దీంతో నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్'పైనే కాయదు లోహార్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. భారీ అంచనాల నడుమ సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మిశ్రమ స్పందనను అందుకుంటున్నప్పటికీ వసూళ్ల పరంగా మాత్రం దూసుకెళ్తోంది. అయితే ఈ సినిమాలో కాయదుకు మంచి అవకాశం దక్కినా.. ఆమె పోషించిన పాత్ర మాత్రం కెరీర్‌కు ఎంతవరకు ఉపయోగపడుతుందనే చర్చ మొదలైంది. తండ్రి అప్పులను తీర్చేందుకు బి–గ్రేడ్ చిత్రాల్లో నటించే యువతిగా సినిమాలో ఆమె పాత్రను చూపించడం ప్రేక్షకుల్లో ఒక వర్గానికి అసహనాన్ని కలిగించిందనే టాక్ వినిపిస్తోంది. పాత్రలో వైవిధ్యం ఉన్నప్పటికీ, ఆమెకు సరైన స్థాయిలో ప్రాధాన్యం లేకపోవడంతో పాటు పాత్ర స్వభావం కారణంగా నెగెటివిటీ ఎదుర్కోవాల్సి వస్తోందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం 'ది ప్యారడైజ్' వంటి భారీ చిత్రంలో కనిపించే అవకాశం వచ్చినప్పటికీ, అది కాయదు కెరీర్‌కు ఆశించిన స్థాయిలో ఉపయోగపడలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వరుస చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్న సమయంలో ఇలాంటి పాత్రల ఎంపిక ఆమె కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇకపై కథతో పాటు తన పాత్రకు ఉన్న ప్రాధాన్యం, తెరపై తన ఇమేజ్‌పై పడే ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని సినిమాలను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు. మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న కాయదు లోహార్ ఇకపై మరింత జాగ్రత్తగా కథలను ఎంచుకుంటే కెరీర్‌లో మంచి అవకాశాలను అందుకునే అవకాశం ఉంటుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# పాటకు సాహిత్య గౌరవం



ఆయన పాటల్లో పదాలు కేవలం అలంకారాలుగా ఉండవు.. భావాలకు ప్రాణం పోసే అక్షరాలుగా నిలుస్తాయి. ప్రేమను ఇద్దరి మధ్య సంబంధంగానే కాకుండా అనుబంధం, నిరీక్షణ, విరహం, జీవితం వంటి విశాల అనుభ వాలుగా ఆవిష్కరించే ప్రసూన్ జోషి భారతీయ సినీ గీత రచయితగా ప్రత్యేక గుర్తింపు పొందారు. 1971 సెప్టెంబర్ 16న ఉత్తరాఖండ్‌లోని అల్మోరాలో జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే సాహిత్య, సాంస్కృతిక వాతావరణంలో పెరిగారు. 17 ఏళ్ల వయసులోనే 'మై ఔర్ వో' పుస్తకాన్ని ప్రచురించారు. అనంతరం ఢిల్లీలో ప్రకటనల రంగంలో అడుగుపెట్టి నెస్లే, కోకా–కోలా, మైక్రోసాఫ్ట్, మాస్టర్‌కార్డ్, లోరియల్, యూనిలీవర్, బ్రిటానియా, డాబర్, ఐటీసీ ఫుడ్స్, రిలయన్స్, రిలయన్స్ జియో, పేటీఎం వంటి ప్రముఖ బ్రాండ్లకు పనిచేశారు. 'ఠండా మత్లబ్ కోకా–కోలా' ప్రచారానికి 2003లో కాన్స్ గోల్డెన్ లయన్ పురస్కారం అందుకున్నారు. సినీ గీత రచయితగా 2001లో రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలోని 'లజ్జా' చిత్రంతో ప్రయాణం ప్రారంభించారు. 'ఆంఖేన్', 'క్యోన్?', 'హమ్ తుమ్' చిత్రాలతో తనదైన ముద్ర వేశారు. 'హమ్ తుమ్'లోని 'సాన్స్ కో సాంసోన్ మే', 'గోరే గోరే', 'చక్ దే', 'లడ్కీ క్యోన్' వంటి పాటలు విశేష ఆదరణ పొందాయి. రాకేశ్ ఓం ప్రకాశ్ మెహ్రా దర్శకత్వంలోని 'రంగ్ దే బసంతీ'తో ఆయన గీత రచన మరో స్థాయికి చేరింది. 'ఇక్ ఓంకార్', 'మస్తీ కీ పాఠశాల', 'తూ బిన్ బతాయే', 'రూబరూవ్' వంటి పాటలు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. 'తారే జమీన్ పర్'లో 'బమ్ బమ్ బోలే', 'మా', 'తారే జమీన్ పర్' వంటి గీతాలు పిల్లల ప్రపంచంలోని భావోద్వేగాలను ఆవిష్కరించాయి. అనంతరం ఏఆర్ రెహమాన్‌తో కలిసి 'గజిని', 'ఢిల్లీ–6', 'భాగ్ మిల్కా భాగ్' చిత్రాలకు పనిచేశారు. 'హై గుజారిష్', 'అర్జియాన్', 'మసక్కలి', 'భాగ్ మిల్కా భాగ్', 'ఓ రంగ్‌రేజ్', 'జిందా' వంటి పాటలు చిరస్మరణీయంగా నిలిచాయి. 'ఫిర్ మిలేంగే', 'బ్లాక్', 'ఫనా', 'ఆరక్షణ్', 'సత్యాగ్రహ', 'నీర్జా', 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' తదితర చిత్రాలకు కూడా ఆయన పాటలు రాశారు. 'తారే జమీన్ పర్', 'చిట్టగాంగ్' చిత్రాలకు గీత రచనకు జాతీయ చలనచిత్ర పురస్కారాలు అందుకున్నారు. 'హమ్ తుమ్', 'ఫనా', 'ఢిల్లీ–6', 'భాగ్ మిల్కా భాగ్' తదితర చిత్రాలకు పలు అవార్డులు లభించాయి. ఐజీఎన్‌సీఏ ట్రస్టీగా, నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ ప్యానెల్ సభ్యుడిగా, మహాత్మా గాంధీ 150వ జయంతి ఉత్సవాల జాతీయ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. భారత ప్రభుత్వం 2015లో పద్మశ్రీతో సత్కరించింది. ఆధునికతను స్వీకరిస్తూనే కవిత్వాన్ని కోల్పోని పదం, సరళతలోనే లోతైన భావాన్ని పలికించే తీరు, పాపులర్ సంగీతంలోనూ సాహిత్యపు స్పర్శను నిలుపుకోవడం ప్రసూన్ జోషి గీతాల ప్రత్యేకత. అందుకే ఆయన పాటలు కాలంతో పాటు మారకుండా.. కాలాన్ని దాటి మనిషి అనుభవాలకు ప్రతిధ్వనిగా నిలిచిపోతున్నాయి.

# సంబరాల ఏటి గట్టుపై క్రేజీ అప్‌డేట్

మెగాహీరో సాయి దుర్గా తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల ఏటి గట్టు). రోహిత్ కేపి దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ డ్రామాలో శ్రీకాంత్, ఐశ్వర్య లక్ష్మి, జగపతిబాబు, సాయికుమార్, అనన్య నాగళ్ల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిర్మాత చైతన్య రెడ్డి మాట్లాడుతూ సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. 'ఎస్‌వైజీ' మొత్తం 2 గంటల 40 నిమిషాల నిడివితో ఉంటుందని, ఇందులో ఏకంగా 2 గంటల 38 నిమిషాల పాటు విస్తృతంగా వీఎఫ్‌ఎక్స్‌ను ఉపయోగించినట్లు తెలిపారు. సినిమా 2027 జనవరి 12న కచ్చితంగా విడుదలవుతుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ చిత్రానికి పార్ట్ 2ను కూడా ప్లాన్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రకటనతో 'సంబరాల ఏటి గట్టు'పై అంచనాలు మరింత పెరిగాయి.

# 'ది ప్యారడైజ్' దూకుడు.. తొలిరోజే రూ.88 కోట్లు

నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'ది ప్యారడైజ్' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో దూసుకెళ్తోంది. సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా తొలి రోజే భారీ కలెక్షన్లు రాబట్టి నాని కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్‌గా నిలిచింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం 'ది ప్యారడైజ్' ప్రపంచవ్యాప్తంగా తొలి రోజు రూ.88 కోట్లు వసూలు చేసినట్లు తెలుస్తోంది. భారత్‌లో ఇప్పటివరకు రూ.34.65 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. పూర్తి స్థాయి లెక్కలు వెల్లడైతే ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది. నాని గత చిత్రాలు 'దసరా' తొలి రోజు రూ.23.20 కోట్లు, 'హిట్:3' రూ.21 కోట్లు సాధించగా.. 'ది ప్యారడైజ్' ఆ రికార్డులను అధిగమించింది. ఇందులో తెలుగు వెర్షన్ ద్వారా అత్యధికంగా రూ.25.10 కోట్ల నెట్ వసూళ్లు రాగా, హిందీలో రూ.1.82 కోట్లు,



తమిళంలో రూ.1.02 కోట్ల నెట్ కలెక్షన్లు నమోదయ్యాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం కావడంతో 'ది ప్యారడైజ్'పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్టుగానే అడ్వాన్స్ బుకింగ్స్, భారీ స్థాయి విడుదలతో ఈ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది.

# 'కాకా' సంక్రాంతి బరిలో పక్కా!

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కాకా'. ఇందులో చిరంజీవి కదిరి కాళిదాస్ అనే పాత్రలో సందడి చేయనున్నారు. అనస్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా 'సిగ్మా' ముందస్తు విడుదల వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి.. 'కాకా' సినిమా చిత్రీకరణ పురోగతిపై ఆసక్తికరమైన సమాచారం పంచుకున్నారు. ''సినిమా తొలి భాగం పూర్తయింది. రెండో భాగం కూడా 30 శాతం పూర్తయింది. దీంతో 'కాకా' జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు మరోసారి స్పష్టమైంది. ప్రస్తుతం చిత్రబృందం ఒకవైపు చిత్రీకరణ కొనసాగిస్తూనే మరోవైపు మాటల రికార్డింగ్ పనులను కూడా ప్రారంభించింది. దీనికి సంబంధించిన దృశ్యాలను కూడా చిత్రబృందం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది.

# అక్టోబర్ 16న 'రణబాలి' రిలీజ్ పక్కా

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను టీ–సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. విజయదశమి సందర్భంగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా వాయిదా పడుతుందంటూ వస్తున్న రూమర్స్‌కు చెక్ పెడుతూ మేకర్స్ తాజాగా విడుదల తేదీని మరోసారి ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. తన మాతృభూమిని, తన ప్రజలను కాపాడేందుకు ప్రతిజ్ఞ చేసి, వీరతిలకం ధరించిన యోధుడు రణబాలిగా విజయ్ దేవరకొండ మెస్మరైజింగ్ లుక్‌తో రూపొందించిన ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఇటీవల విడుదలైన 'ఏందయ్యా సామీ..' ఫుల్ లిరికల్ సాంగ్‌కు కూడా సోషల్ మీడియాలో భారీ స్పందన లభిస్తోంది. 19వ శతాబ్దం నేపథ్యంలో 1854 నుంచి 1878 మధ్య



బ్రిటీష్ పాలన కాలంలో కొట్టుచేసుకున్న యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భారీ కథ, యాక్షన్ నేపథ్యంతో రూపొందుతున్న 'రణబాలి'పై పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్‌లో ఆసక్తి నెలకొంది.

# కోమల్‌తో గోవిందా.. పెళ్లి వార్తలపై క్లారిటీ

బాలీవుడ్ సూపర్‌స్టార్ గోవిందా తన సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో విలక్షణమైన పాత్రలు పోషించి కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. అయితే కొంతకాలంగా ఆయన వైవాహిక జీవితానికి సంబంధించిన వార్తలు చర్చనీయాంశంగా మారాయి. సతీమణి సునీతా అహూజాతో విభేదాలున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. తాజాగా తన సహనటి, రూమర్డ్ గర్ల్‌ఫ్రెండ్ కోమల్ రాణి స్వర్ణకర్‌తో కలిసి ముంబైలోని ప్రసిద్ధ లాల్‌బాగ్‌చా రాజా గణపతి మండపాన్ని గోవిందా సందర్శించడం మరింత చర్చకు దారితీసింది. దీంతో వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారంటూ వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్పందిం చిన గోవిందా.. తన కొత్త చిత్రం 'రూప' కోసం ప్రార్థించేందుకే లాల్‌బాగ్‌చాకు వెళ్లినట్లు తెలిపారు. గతంలో కరిష్మా కపూర్‌తో కలిసి ఆలయాలను సందర్శించినప్పుడు తన సినిమాలు విజయ వంతమయ్యా యని, ఆ తర్వాత రవీనా టాం డన్‌తో, ఇప్పు డు కోమల్ రాణి స్వర్ణకర్‌తో కలిసి అక్క డికి వెళ్లా నని చెప్పా రు. చాలా కాలం తర్వాత మళ్లీ సినిమాల్లో నటిస్తున్నం దున ప్రత్యేకంగా ప్రార్థనలు చేసినట్లు వెల్లడించారు. అయితే తనకు సినిమా అవకాశాలు రాకుండా చేయడానికి, తన ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కొందరు వ్యూహాత్మకంగా ఈ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తాను ప్రస్తుతం తన పనిపైనే దృష్టి పెట్టానని, తన వ్యక్తిగత జీవితం గురించి ఇతరులు పట్టించుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తనకు ఎలాంటి వ్యక్తిగత సంబంధాలు ఉన్నా అవి ఇతరులకు సంబంధించిన విషయం కాదని గోవిందా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# ధనుష్ 'డి56'లో ప్రీతి ముకుందన్

వైవిధ్యభరితమైన కథలను ఎంచుకుంటూ హీరోగా, దర్శకుడిగా వరుస విజయాలు అందుకుంటున్న కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్.. తన 56వ చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించాడు. 'లబ్బర్ పందు' ఫేమ్ తమిళరసన్ పచముత్తు దర్శకత్వంలో పల్లెటూరి నేపథ్యంలో హై వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కనుంది. మధురై సమీపంలోని ఆలయంలో చిత్ర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సినిమాలో వడివేలు, ఎస్.జె. సూర్య కీలక పాత్రల్లో నటిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్మెంట్స్, ప్రైమ్ మార్క్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఇక కొంతకాలంగా ఈ సినిమాలో హీరోయిన్‌గా ప్రీతి ముకుందన్ నటించనున్నట్లు వార్తలు వస్తుండగా.. తాజాగా జరిగిన పూజా కార్యక్రమాలతో ఆమె ఎంపిక అధికారికమైంది. ధనుష్‌కు జోడీగా ప్రీతి ముకుందన్ కథానాయికగా నటించనుంది. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఈ యంగ్ బ్యూటీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రాన్ని 2027 సమ్మర్ స్పెషల్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్.జె. సూర్య మాట్లాడుతూ.. ''అనేక సవాళ్లు, అడ్డంకులను అధిగమించిన తర్వాత 'డి56' ప్రయాణాన్ని ప్రారంభించాం. 'లబ్బర్ పందు'తో తన ప్రతిభను నిరూపించుకున్న రచయిత, దర్శకుడు తమిళరసన్ పచముత్తు ఈసారి మరింత భారీ స్థాయిలో ఎలాంటి చిత్రాన్ని రూపొందించారో చూడాలని ఆసక్తిగా ఉంది. అద్భుతమైన బృందం మద్దతుతో మన నేటివిటీకి దగ్గరగా ఉండే కథ ఇది. 'డి56' ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు.



# నెట్టింట దూసుకెళ్తున్న 'రామాయణ' తొలి గీతం

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ నుంచి విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన లభించగా.. తాజాగా తొలి సింగిల్ 'జై జై రామ్'ను తెలుగులో విడుదల చేశారు. దైవభక్తి, సంగీతం, సినిమాటిక్ గ్రాండియర్ కలయికతో రూపొందిన ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నిర్మాత నమిత్ మల్హోత్రా అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ విజువల్ వండర్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యష్ రావణాసురుడిగా, కాజల్ అగర్వాల్ మండోదరిగా, రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖగా కనిపించనున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ భారీ మైథలాజికల్ డ్రామా తొలి భాగం దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

"This newspaper is published by **JAMMUGANI MOHAN** from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by **JAMMUGANI MOHAN** and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." **PRGI NO: APMUL/26/A3106**. Email: epaper.spandanews@gmail.com , Cell: **94908 24686**

ప్రజాగళమే స్పంద జాతీయ తెలుగు దినపత్రిక





# ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

### ఉత్సాహంగా పల్నాడు జిల్లా స్థాయి 'రెడ్ రిబ్బన్ క్విజ్' పోటీలు

**నరసరావుపేట, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'యూత్ ఫెస్ట్ 2026'లో భాగంగా శనివారం జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై సమగ్ర అవగాహన పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ పోటీలలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు మరియు కళాశాలల నుంచి 8, 9వ తరగతులు మరియు ఇంటర్మీడియట్ (11వ తరగతి) విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద ఎత్తున, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ యువతకు ఆరోగ్యం, సామాజిక అంశాలపై సరైన అవగాహన ఉండాలని, అందుకోసమే రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఈ క్విజ్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ రోజు నిర్వహించిన పోటీల్లో పాఠశాల మరియు కళాశాల విభాగాల్లో అత్యధిక స్కోరు సాధించిన 'టాప్-2' జట్లను త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే క్విజ్ కాంపిటీషన్‌కు పంపించనున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజశేఖర్, దిశ సిబ్బంది, జిల్లాలోని టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ఎన్జీవోల ప్రతినిధులు, వివిధ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు పార్టీల సహకారం అవసరం: మయూర్ అశోక్




**గుంటూరు, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్ ):** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఆర్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల ప్రత్యేక జాబితాలను ప్రచురించినట్లు తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆర్ఓలను ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత నిబంధనలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కచ్చితంగా పాటించి ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని సూచించారు. రాజకీయ పార్టీల సందేహాల నివృత్తికి నగర పాలక సంస్థలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఐ. కిషోర్, డిప్యూటీ కమిషనర్లు, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఆర్ఓలు, ఏఆర్ఓలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆదేశాలను గంగలో కలుపుతున్న తెలుగు యువత...

**ప్రత్తిపాడు సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్):** ప్రతిపాడు మండలం పత్తిపాడు గ్రామంలో శనివారం నాడు చౌదరి యూత్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం జరిగింది. అయితే పోలీస్ వారు ప్రభుత్వ వారు నిమజ్జనాల కార్యక్రమాల్లో ఎక్కడ కూడా ఏ పార్టీకి సంబంధించిన జెండాలు ఉండకూడదు అని ఆదేశించినప్పటికీ కూడా ప్రత్తిపాడులో కనిపించని ప్రభుత్వ ఆదేశాలు. మాకు మేమే బాసులం మేము ఎవరి మాట వినడం అన్నట్లు తెలుగు తమ్ముళ్లు హల్చల్ చేస్తున్నారు



# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల ముసాయిదా జాబితా

### 28లోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరణ.. కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు, సెప్టెంబర్ 26 (స్పంద న్యూస్ ):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 1 నుంచి 76 వార్డులకు సంబంధించి సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను ప్రత్యేకంగా గుర్తించి మార్క్ చేసిన ముసాయిదా జాబితాలను శనివారం నోటీసు బోర్డులపై ప్రచురించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్, 1994 నిబంధనలకు అనుగుణంగా 1 నుంచి 76 వార్డుల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ విభాగాలకు చెందిన మహిళా ఓటర్లను ప్రత్యేకంగా గుర్తించి జాబితాలను సిద్ధం చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. ముసాయిదా ఓటర్ల జాబితా కాపీలను గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రచురించిన జాబితాలో తమ పేరును ఎస్సీ, ఎస్టీ, బీసీ లేదా మహిళా ఓటరుగా చేర్చాలని కోరుకునే అర్హులైన వ్యక్తులు సంబంధిత ఫారం-2 ద్వారా క్లెయిమ్ దాఖలు చేయవచ్చని సూచించారు.



అదేవిధంగా జాబితాలో నమోదైన ఏదైనా ఓటరు పేరుపై అభ్యంతరం ఉన్నవారు ఫారం-3 ద్వారా అభ్యంతరం తెలియజేయవచ్చని పేర్కొన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను 2026 సెప్టెంబర్ 28వ తేదీలోపు కార్యాలయ పని వేళల్లో గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నేరుగా సమర్పించవచ్చని తెలిపారు. పోస్టు ద్వారా పంపే వారు కూడా అదే తేదీలోగా కార్యాలయానికి చేరేలా పంపాలని సూచించారు. నిర్ణీత గడువు ముగిసిన అనంతరం అందే దరఖాస్తులు, అభ్యంతరాలను పరిశీలించబోమని కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు.

# బీఆర్ స్టేడియం అభివృద్ధి పనులు వేగవంతం

- పెండింగ్ పనులు త్వరలో ప్రారంభం.. వాకర్స్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం
- కొత్త పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి: కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు, సెప్టెంబర్ 26 స్పంద న్యూస్ :: గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియం అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు నిలిచిపోయిన పెండింగ్ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్ తెలిపారు. శనివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్‌తో కలిసి బీఆర్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియంలో వాకర్స్, క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులపై అధికారులు, సిబ్బందితో కమిషనర్ సమీక్షించారు. సీసీ డ్రైన్లు, వాకింగ్ ట్రాక్‌లు, క్రీడా కార్యకలాపాలకు అవసరమైన ఇతర సదుపాయాల ఏర్పాటుకు సమగ్ర డీపీఆర్‌లు సిద్ధం చేసి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో స్టేడియంలోకి నీరు చేరడం, వాకింగ్ ట్రాక్‌లపై నీరు నిలిచిపోవడంతో వాకర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడుతున్నట్లు మయూర్ అశోక్ తెలిపారు. యువత, క్రీడాకారులకు మెరుగైన వాతావరణం కల్పించేలా బీఆర్ స్టేడియంను సమగ్రంగా



అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మహ్మద్ నసీర్‌తో కలిసి పొన్నూరు రోడ్డులోని స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. చంద్రబాబు నాయుడు కాలనీ, సాయిబాబా కాలనీ, హుస్సేన్ నగర్, నూర్ మసీద్ స్ట్రీట్, సాయి కృష్ణ నగర్, ఆనంద్‌పేట, కిద్వాయి నగర్, రౌఫ్ నగర్ ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి తోడ్పడేలా ఈ స్థలంలో పార్కును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. పార్కులో వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు, చిన్నారుల ఆటస్థలాలను ఏర్పాటు చేసి అన్ని వయసుల వారికి ఉపయోగపడేలా సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ మాట్లాడుతూ బీఆర్ స్టేడియం అభివృద్ధి పనులతో పాటు ప్రతిపాదిత కొత్త పార్కు నిర్మాణంలో ఎలాంటి తాత్సారం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు సంబంధించిన తాగునీటి సరఫరా, పారిశుధ్య సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. ఈ పర్యటనలో ఎస్ఈ జి.వేంకటేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ చైతన్యతో పాటు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# తెనాలి నగరానికి అందం.. ప్రజలకు భద్రతే లక్ష్యం

### ఆటోనగర్ వి.ఎస్.ఆర్ కళాశాల వరకు 2.8 కి.మీ. మేర సెంట్రల్ లైటింగ్ పూర్తి

### రూ.2 కోట్లతో లైటింగ్.. రూ.50 లక్షలతో సుందరీకరణ

**తెనాలి,సెప్టెంబర్26(స్పంద న్యూస్)** అభివృద్ధిలో భాగంగా ఆటోనగర్ నుంచి వినాయక విగ్రహం మీదుగా వి.ఎస్.ఆర్





కళాశాల వరకు సుమారు 2.8 కిలోమీటర్ల మేర రోడ్ డివైడర్‌లో దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేశామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి, ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో సరైన లైటింగ్, రహదారి సదుపాయాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ప్రమాదాలు కూడా జరిగేవని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నిధులను సమీకరించి సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యంగా ఆటోనగర్‌లో నైట్ షిఫ్టుల్లో పనిచేసే ఉద్యోగులు, కటివరం గ్రామ ప్రజలు ఈ మార్గంలో ప్రతిరోజూ రాకపోకలులకు రాత్రి వేళల్లో మెరుగైన భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ లైటింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. తెనాలి నగరానికి ఒక అందమైన ముఖద్వారం ఉండాలనే ఉద్దేశంతో ఆటోనగర్ నుంచి వి. ఎస్.అర్. కళాశాల వరకు ఉన్న ప్రాంతాన్ని మరింత సుందరంగా అభివృద్ధి చేయాలని రెండు నెలల క్రితమే అధికారులకు సూచించినట్లు మంత్రి తెలిపారు. ఆర్ అండ్ బి. శాఖ ద్వారా సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని, అదే విధంగా సెంట్రల్ డివైడర్‌లో మొక్కలు నాటడం, డివైడర్లకు రంగులు వేయడం, ఇతర సుందరీకరణ పనుల కోసం జ=ణూా సి. ఆర్. డి.ఏ. నిధుల నుంచి సుమారు రూ.50 లక్షలు మంజూరు చేశామని చెప్పారు. డివైడర్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, సుమారు 2.8 కిలోమీటర్ల మేర డివైడర్లను సుందరీకరించే పనులు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం ఒక వైపు సుమారు 450 మొక్కలు నాటామని, మరో వైపు కూడా మరో 450 మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తెనాలి నగరంలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ ఇదే తెనాలి అనే మంచి అనుభూతి కలిగేలా, అందమైన, ఆహ్లాదకరమైన నగరంగా స్వాగతం పలికే విధంగా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తాం" అని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. అదేవిధంగా కటే వరం వద్ద వంతెన నిర్మాణాన్ని కూడా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులను విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన ఆర్ అండ్ బి అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, ఆటోనగర్ వ్యాపారులు, ప్రజలు, కూటమి పార్టీల నాయకులకు మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ తెనాలి నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు.

